# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 242 | హైదరాబాద్ | గురువారం 19-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00







## మూసీ ప్రాజెక్టు
# రూ.1.5 లక్షల కోట్ల స్కామ్



- ప్రాజెక్టులో పారదర్శకత లేదంటూ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ వాకౌట్
- కేటీఆర్ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం.. తొలిదశకు రూ.7,000 కోట్ల అంచనా అని వెల్లడి
- డీపీఆర్ లేకుండా వేల ఇళ్లను ఎలా కూల్చివేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్

11లో

## మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై
# స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

- ఈ కేసులో పుట్టా మహేశ్ సహా ఎనిమిది మందికి స్టేషన్ బెయిల్
- స్టేషన్ బెయిల్ రావడంలో తన ప్రమేయం లేదన్న ముఖ్యమంత్రి
- ఈ కేసు దర్యాప్తు కోసం సిట్ వేసినట్లు వెల్లడి
- 2028లో తెలంగాణల ఎన్నికలు రాబోవన్న ముఖ్యమంత్రి
- 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని జోస్యం

11లో



## రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన
# తుమ్మల నాగేశ్వరరావు




11లో

- 22న రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్టు తెలిపిన తుమ్మల
- 70 లక్షల మంది ఖాతాల్లోకి నిధులు జమ అవుతాయని వెల్లడి
- రేపు నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సీఎం ప్రారంభిస్తారన్న మంత్రి




11లో

## వాణిజ్య ఎల్పీజీ వాడకంపై
# కేంద్రం కీలక నిర్ణయం

- దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదని చెప్పిన కేంద్రం
- ఆందోళనతో కొనుగోళ్లు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి
- వాణిజ్య ఎల్పీజీ నుంచి పీఎన్జీకి మారే రాష్ట్రాలకు ప్రోత్సాహం
- దేశీయంగా 40 శాతం పెరిగిన ఎల్పీజీ ఉత్పత్తి
- సాధారణంగానే కొనసాగుతున్న గ్యాస్ సిలిండర్ల డెలివరీలు

## భారత్ ట్యాక్సీ సూపర్ సక్సెస్..
# డ్రైవర్లకు రూ.35 కోట్ల ఆదాయం

11లో




- రూ.5 కోట్ల పెట్టుబడితో డ్రైవర్లకు రూ.35 కోట్లకు పైగా ఆదాయం అందించిన భారత్ ట్యాక్సీ
- డ్రైవర్ల నుంచి కమీషన్ వసూలు చేయని సహకార నమూనా
- ప్రయాణికులపై ఉండని సర్జ్ ప్రైసింగ్, కన్వీనియన్స్ ఫీజు భారం
- డ్రైవర్లే యజమానులుగా ఉండే సరికొత్త విధానం
- ప్రస్తుతం ఢిల్లీ-ఎన్సీఆర్, గుజరాత్‌లో సేవలు.. త్వరలో దేశవ్యాప్త విస్తరణ


# దాడుల్లో ఇరాన్ నిఘా వ్యవహారాల మంత్రి మృతి
## : ఇజ్రాయెల్ మంత్రి ప్రకటన

- ఇరాన్ కీలక నేతలు లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు
- ఖతీబ్ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్ వెల్లడి
- ఇరాన్ కీలక నేతల వేట కొనసాగుతుందన్న కాట్జ్

11లో

## పోలవరం ప్రాజెక్టు
# రాష్ట్రానికి జీవనాడి

నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



11లో

- ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి సమావేశం
- పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడత చెక్కు అందజేత
- గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం ఆలస్యమైందన్న ముఖ్యమంత్రి

## జోరువానలో పేద ముస్లిం ఇంటికి
# మంత్రి లోకేశ్... అక్కడే ఇఫ్తార్ విందు

- తాడేపల్లిలో పేద ముస్లిం కుటుంబంతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి లోకేశ్
- జోరువానను సైతం లెక్కచేయకుండా షేక్ అమీర్ ఇంటిని సందర్శించిన మంత్రి
- కుటుంబానికి కొత్త ఇల్లు నిర్మించి ఇస్తానని భరోసా
- మంగళగిరిలో త్వరలో మరో 2000 ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని వెల్లడి
- ప్రజలకు మేలు చేసేందుకే దేవుడు అవకాశం ఇచ్చారని వ్యాఖ్య



11లో

# నట్టింట్లో కల్తీ రక్కసి

భారతదేశంలో ఆహార కల్తీ రక్కసి కోరలు చాస్తున్నది. యేటా దేశవ్యాప్తంగా కల్తీ ఆహారం కారణంగా సుమా రు 70 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారనే చేదు నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తు న్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం.. భారత్‌లో యేటా 10 కోట్ల మంది కల్తీ ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందులో 20 శాతం మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఫలితంగా నిల్వ ఉంచిన కలుషిత ఆహారం కొనుక్కుని తిని మరీ ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆహార భద్రతా ప్రమాణా ల అమలులో ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్ల కాలం లో అట్టడుగు స్థానానికి పడిపోయింది. తెలు గు రాష్ట్రాల్లో పాల కల్తీ నిరంతరాయంగా సాగుతున్న ఒక ప్రమాదకర వ్యాపారంగా మారింది. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి రోజూ వినియోగించే పాలు ఇప్పుడు విషపూరిత రసాయనాలతో నిండిపోతున్నాయి. పాల సాంద్రత పెంచేందుకు గంజి పొడిని వాడుతున్నారు. వంటగదిలో నిత్యం వినియోగించే పదార్థాలు, మసాలాలన్నీ ఇప్పుడు కల్తీ కాటుకు గురవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు ప్రధాన పట్టణాల్లో తరచూ 'కల్తీ'కారుల అక్రమాలు వెలు గు చూడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల మైలార్‌దేవ్‌పల్లి, లాలాగూడల్లో అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కేంద్రాలపై పోలీసులు జరిపిన దాడులు ఒక ఎత్తయితే, బంజారాహిల్స్ వంటి సంపన్నుల నివాస ప్రాంతంలో 'ఫ్రైడ్ డెయిరీ' పేరిట సాగుతున్న కల్తీ నెయ్యి దందా మరో ఎత్తు. కేవలం అల్లం వెల్లుల్లి, నెయ్యి మాత్రమే కాదు.. మనం నిత్య ఇంట్లో వినియోగించే పాలు, కారం, నూనె నుంచి టీ పొడి చివరకు.. ప్రతీది నకిలీమయం అవుతుండటం ఆందోళనకరం. శంషాబాద్ జోన్ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో పట్టుబడి న కల్తీ పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలిస్తే, ఆహార భద్రత ప్రమాణాలను గాలికొదిలేసి, లాభార్జనే ధ్యేయంగా దందా సాగినట్లు స్పష్టమవుతున్నది. కల్తీల వెనుక వాస్తవాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో అక్రమార్కులు కుళ్లిన అల్లం, తక్కువ నాణ్యత గల వెల్లుల్లికి తోడు.. జిగురు కోసం ప్రమాదకరమైన 'ఎక్స్‌జన్ గమ్ పౌడర్', రంగు కోసం సింథటిక్ రసాయనాలు, నిల్వ ఉండటానికి అధిక మోతాదులో సిట్రిక్ యాసిడ్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ పదార్థాలు మనిషి శరీరంలోకి వెళితే జీర్ణకోశ వ్యాధుల నుంచి మొదలుకొని దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. కల్తీ నెయ్యి విషయానికొస్తే, అక్రమార్కులు తక్కువ ధరకు లభించే పామాయిల్, డాల్డా, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఫ్యాట్స్‌ను ఆవు, గేదె పాల మీగడలో కలిపి తమదే స్వచ్ఛమైన నెయ్యి అని మార్కెట్లోకి వదులుతున్నారు. పాల ను చిక్కగా మార్చేందుకు వీరు యూరియా, డిటర్జెంట్ పొడి, గ్లూకోజ్, స్టార్చ్ పౌడర్లు వాడుతున్నట్లు తేలింది. ఈ నెయ్యిని వినియోగిస్తే కాలేయం దెబ్బతినడం, మూత్రపిండాల వైఫల్యం, గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఈ కల్తీ మహమ్మారి ఇంతలా వేళ్లూనుకోవడానికి మారుతున్న జీవనశైలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. ఆధునిక కాలంలో 'ఇన్‌స్టంట్ ఫుడ్'పై మోజు, ఏ వంట అయి నా త్వరగా సిద్ధమైపోవాలనే ఆతృత.. కల్తీ కేటుగాళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకునే ఓపిక లేకపోవడం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్ల వెంట పడటం వల్ల మనం తెలియకుండానే విషాన్ని కొని తెచ్చుకుంటున్నాంతక్కువ ధరకే దొరుకుతున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా రోడ్డు పక్కన విక్రయించే విడి అల్లం పేస్ట్‌లు, లోకల్ బ్రాండ్ నెయ్యి ప్యాకెట్లను ఆశ్రయించడం ప్రాణాంతకం. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో లాభాల కోసం ఇలాంటి కల్తీ ఉత్పత్తులనే వాడుతున్నట్లు యంత్రాంగం విచారణలో తేల డం గమనార్హం. కేవలం పోలీసుల దాడులు, అరెస్టులతోనే ఈ వ్యవస్థ ప్రక్షాళన కాదు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలిసాధ్యమైనంత వరకూ ఇంట్లో తయారు చేసుకునే పదార్థాలనే, వినియోగించు కోవడం ఉత్తమం. అధిక లాభాల కోసం సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠాలపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రయోగించి, కల్తీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాలు తెల్లగా కనిపించేందుకు అక్రమార్కులు వైట్ పెయింట్ ను ఉపయోగిస్తున్నారు. నిల్వ ఉంచేందుకు ఫార్మాలిన్ వంటి రసాయనాలను వాడుతున్నారు. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా నకిలీ పాల రైతులు అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒక పాడి గేదె పెంపకం దారు వద్ద రెండు మూడు గేదె లు ఉంటే 20 నుంచి 30 మంది వినియోగదారులు ఉంటున్నారు. ఈ అదనపు పాలు ఎక్కడ నుంచి వస్తున్నాయో దేవుడికే తెలియాలి. బజారుకొకటి ఉంటున్న ప్రైవేట్ పాల కేంద్రాలు కాన్ల కొద్దీ పాలను విక్రయిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో యూరియా బస్తా ల నిల్వలు కనిపిస్తున్నాయి. పంటలకు దొరకని యూరియా ఇక్కడ నిల్వ ఉండటం వెనుక అసలు పరమార్థం ఇదే. ల కల్తీ కోసం అక్రమార్కులు యూరి యా, ఫార్మాలిన్, డిటర్జెంట్లు, అమ్మోనియం సల్ఫేట్, కాస్టిక్ సోడా వంటి భయంకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారు. పాల సాంద్రతను పెంచేందుకు గంజి పొడిని కలుపుతున్నారు. నీళ్లు కలిపిన పాలు చిక్కగా కని పించేందుకు సబ్బును ఉపయోగిస్తున్నారు. వైట్ పెయింట్ ని పాలలో కలపడం కల్తీ దారుల మితిమీరిన తెలివికి నిదర్శనం. వీటివల్ల మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, జీర్ణకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫార్మాలిన్ రసాయనం కాలేయం, మూత్రపిండాలపై హానికరమైన ప్రభావాన్ని చూపు తుంది.

# మంత్రివర్గ మార్పులపై ఊహాగానాలు

విజయవాడ, మార్చి 18, (

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గంలో భారీ మార్పులు చేపట్టబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడానికి, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టేందుకు సీఎం సిద్ధమవుతున్నారని మీడియాలో కథనాలు వస్తున్నాయిముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో ఎప్పుడూ క్రమశిక్షణకు, పనితీరుకు పెద్దపీట వేస్తారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల పనితీరుపై ఆయన సంతృప్తిగా లేరని, అందుకే సుమారు 10 మంది మంత్రుల శాఖలను మార్చడం లేదా వారిని పదవుల నుండి తొలగించడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రధానంగా మంత్రుల పనితీరును అంచనా వేయడానికి కొన్ని కీలక ప్రమాణాలను ఆయన ప్రాతిపదికగా తీసుకుంటున్నట్టు సమాచారం. ముఖ్యంగా మంత్రులు తమకు కేటాయించిన శాఖలపై ఎంతవరకు అవగాహన కలిగి ఉన్నారు? ఎంతమేరకు పట్టు సాధించారని బేరీజు వేస్తున్నారు. పాలనలో అధికారులతో కలిసి ఎలా పని చేస్తున్నారు? ఎన్ని సమీక్షా సమావేశాలు నిర్వహించారు? కేంద్ర ప్రభుత్వం నుండి తమ శాఖలకు రావాల్సిన నిధులను రాబట్టడంలో ఎంతవరకు సఫలీకృతులయ్యారు? ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు ఏ మేరకు కృషి చేశారు? ఎన్ని ప్రెస్ మీట్స్ నిర్వహించి ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టారు? .. లాంటి అంశాలపై చంద్రబాబు నివేదికలు రెడీ చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతి మంత్రికీ ఒక ప్రోగ్రెస్ కార్డ్ సిద్ధమవుతోంది. ఈ నివేదికలు కేవలం

పైపైన పరిశీలనతో కాకుండా, ప్రతి నిమిషం వారి పనితీరును పర్యవేక్షించి తయారు చేస్తున్నారు. ఈ రిపోర్టుల ఆధారంగానే ఎవరిని కొనసాగించాలి, ఎవరికి ఉద్వాసన పలకాలి అనే విషయంలో సీఎం ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ పరిణామం ప్రస్తుతం ఉన్న చాలా మంది మంత్రులకు నిద్ర లేకుండా చేస్తోంది. ఈసారి జరగబోయే మార్పుల్లో లోకేశ్ టీంకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తు రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని, లోకేష్‌కు అండగా ఉండేలా ఉత్సాహవంతులైన నాయకులకు, యువకులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలుస్తోంది. లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే వారికే ఈసారి పెద్దపీట వేయబోతున్నట్లు సమాచారం. ఈ మంత్రివర్గ మార్పులు కేవలం పరిపాలన కోసమే కాకుండా, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఉంటాయని తెలుస్తోంది. ఎన్నికలకు వెళ్లే ముందు బలమైన టీమ్‌ను సిద్ధం చేసుకోవడం చంద్రబాబు వ్యూహం. ఉగాది పండుగ నాటికి లేదా మరో రెండు మూడు నెలల్లో ఈ మార్పులు ఉండవచ్చని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా కేబినెట్ మార్పులు, చేర్పులకు సంబంధించి ఎలాంటి సమాచారమూ లేదు. మొత్తానికి ఏపీ క్యాబినెట్‌లో రాబోయే మార్పులు కేవలం వ్యక్తుల మార్పు మాత్రమే కాదు, అది ప్రభుత్వ పనితీరులో వేగాన్ని పెంచే ప్రయత్నం. 10 మంది మంత్రుల శాఖల మార్పు, కొత్త రక్తానికి అవకాశం ఇవ్వడం ద్వారా పాలనలో కొత్త ఉత్తేజాన్ని తీసుకురావాలని చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రోగ్రెస్ కార్డ్ రాజకీయాల్లో ఎవరి

భవిష్యత్తును నిర్ణయిస్తుందో వేచి చూడాలి.

కూటమి పార్టీలు..

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నారా లోకేశ్ ఒకరకంగా భావి నేతగా అవతరిస్తున్నారు. నారా లోకేశ్ విభిన్నశైలిని చూసిన వారికి ఎవరికైనా త్వరలోనే ఆయన కీలక పదవి అధిష్టించే అవకాశముందని అంచనా వేస్తారు. ఎవరైనా అధికారంలో ఉన్నప్పుడు సమస్యలను ఎత్తి చూపేవారిని శత్రువులుగా చూస్తారు. వైసీపీ హాయంలో సమస్యలు చెప్పిన వాళ్లపై టీడీపీ ముద్ర వేసి వేధించారు. కానీ ఇక్కడ నారా లోకేశ్ మార్పు చూపిస్తున్నారు. సమస్యలను ప్రస్తావించడాన్ని ఓ సానుకూల విషయంగా చూసి వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కోణంలో మన్యంలో సమస్యలపై జాతీయ మీడియా కథనాలు వచ్చినా.. గుంటూరులో డ్రైనేజీ సమస్య గురించి ఓ మహిళ చెప్పినా? ఉద్దేశపూర్వకంగా చేశారని తెలిసినా.. మధ్యాహ్నభోజనం అంశంపై ఓ వీడియోలో విద్యార్థుల ఆగ్రహం గురించి తెలిసినా..ఆయన చాలా పాజిటివ్ గా స్పందించారు. సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. సాధారణంగా అధికారంలో ఉన్నవారు తమ వైఫల్యాలను ఎత్తిచూపే వారిని రాజకీయ శత్రువులుగా చూస్తుంటారు. కానీ, ఇప్పుడు నారా లోకేశ్ దానికి విభిన్నంగా వ్యవహరిస్తున్నారు.. తన వద్దకు వచ్చే విమర్శలను, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను ఆయన ఒక ఫీడ్‌బ్యాక్ గా స్వీకరిస్తున్నారు. సమస్య ఎక్కడ ఉన్నా, అది ఎవరు చెప్పినా.. దాని వెనుక రాజకీయం ఉందా లేదా అని చూడకుండా పరిష్కారం వైపే అడుగులు వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా దేవునిచెరువు పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగ్గా లేదని విద్యార్థులు ఆహారాన్ని చెత్తబుట్టలో పోస్తున్న వీడియో వైరల్

అయ్యింది. దీనిపై లోకేష్ స్పందించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా ఇలాంటి ఘటనలు జరిగితే సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తారు, కానీ లోకేష్ మాత్రం నిస్సంకోచంగా క్షమాపణలు చెప్పారు. బిడ్డలకు నాణ్యమైన ఆహారం అందకపోవడం నా బాధ్యతారాహిత్యం అని పేర్కొంటూ వెంటనే సంబంధిత ఏజెన్సీని తొలగించి, హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేయించారు. ఒక మంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా క్షమాపణలు చెప్పడం రాజకీయాల్లో అత్యంత అరుదైన విషయమని కూడా అంటున్నారునారా లోకేశ్ విషయంలో కూటమి పార్టీల మధ్య కూడా భిన్నాభిప్రాయాలు ఏమీ లేనట్లే కనిపిస్తుంది. నారా లోకేశ్ పర్యవేక్షణలోనే పరిపాలన నడుస్తుందని

మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలకు తెలుసు. కానీ వారు మాత్రం దానిని పాజిటివ్ గానే తీసుకుంటున్నారు. ఎటూ జరిగేది అదేనని, అత్యధిక స్థానాలతో అధికారంలో ఉన్న టీడీపీలో నాయకత్వ బాధ్యతను ఎవరికి అప్పగించాలన్నది ఆ పార్టీ నేతల ఇష్టమన్న అభిప్రాయానికి వచ్చేసినట్లు కనిపిస్తుంది. లోకేష్ అనుసరిస్తున్న ఈ సరికొత్త పంథాను జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కూడా మనస్ఫూర్తిగా ప్రశంసించారు. విమర్శలను స్వీకరించి, వాటిని పరిష్కరించే విషయంలో నారా లోకేశ్ చూపిస్తున్న పరిణతి రాజకీయాల్లో గొప్ప మార్పుకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద నారా లోకేశ్ అందరి అనుమతితోనే త్వరలోనే కీలక పదవి చేపట్టే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేకపోతున్నారు.

# కూటమిని చీల్చేదెలా...

నెల్లూరు, మార్చి 18, (

కూటమిని విడగొడితేనే రాజకీయ భవిష్యత్ అని వైసీపీ గట్టి నమ్మకంతో ఉంది. పై స్థాయిలో అగ్రనేతలు అందరూ కలసిమెలిసి ఉంటున్నారు. వారి మధ్య విభేదాలు సృష్టించడం సాధ్యం కావడం లేదు. అందుకే వైసీపీ.. జనసేన బలాన్ని తగ్గించేందుకు అంబటి రాంబాబు అస్త్రాన్ని ప్రయోగించింది. కాపు వర్గంలో చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అదే సమయంలో వైసీపీకి అది పెద్ద అవకాశంగా స్థానిక ఎన్నికలు రాబోతున్నాయి. ఆ స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీల క్యాడర్ ఏకాభిప్రాయంతో ఉండటం కష్టం. అందరూ అవకాశాలు కోరుకుంటారు. ఇలాంటి సమయంలో ఆ పార్టీల మధ్య చిచ్చు పెట్టడానికి కావాల్సినంత సరుకు లభిస్తుంది. దీన్ని ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపైనే వైసీపీ ప్రణాళికలు ఉండే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం గెలుపు ఓటముల కన్నా వ్యూహ ప్రతివ్యూహాల పర్వం నడుస్తోంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , తిరిగి పుంజుకోవడానికి ఒకే ఒక మార్గం ఉందని బలంగా నమ్ముతోంది. అది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని విడగొట్టడం. అగ్రస్థాయి నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ మధ్య సయోధ్య బలంగా ఉండటంతో, వారిని విడదీయడం సాధ్యం కాదని గ్రహించిన వైసీపీ.. ఇప్పుడు తన వ్యూహాన్ని క్షేత్రస్థాయికి మళ్లించింది. కూటమికి ప్రధాన బలంగా ఉన్న జనసేన ఓటు బ్యాంక్, ముఖ్యంగా కాపు సామాజికవర్గంలో గందరగోళం సృష్టించే బాధ్యతను వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు భుజానికెత్తుకున్నారు. పవన్ కళ్యాణ్ తన సామాజికవర్గాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టారనే పాత విమర్శకు కొత్త పదును పెడుతూ, కాపు వర్గంలో విభేదాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోంది. జనసేన బలం తగ్గితే తప్ప తమకు భవిష్యత్తు లేదని భావిస్తున్న వైసీపీ, సామాజిక సమీకరణాల ద్వారా కూటమి పునాదులను కదిలించే పనిలో పడింది. వైసీపీకి త్వరలో రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఒక గొప్ప అవకాశంగా కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులు సర్దుకుపోయినట్లుగా, స్థానిక ఎన్నికల్లో గ్రామ స్థాయి క్యాడర్ సర్దుకుపోవడం దాపు అసాధ్యం. ప్రతి ఊరిలోనూ మూడు పార్టీలకు చెందిన ఆశావహులు ఉంటారు. సీట్ల కేటాయింపు దగ్గర మొదలయ్యే అసంతృప్తిని క్యాష్ చేసుకోవడమే వైసీపీ అసలు ప్లాన్. ఎక్కడైతే కూటమిలో విభేదాలు

వస్తాయో, అక్కడ తటస్థులను లేదా అసంతృప్త నేతలను ప్రోత్సహించడం ద్వారా చిచ్చు పెట్టాలని వైసీపీ భావిస్తోంది. వైసీపీకి ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలిచామన్న దానికంటే, కూటమి పార్టీల మధ్య ఎంత దూరం పెంచామన్నదే ప్రధానం. "కూటమిలో ఏకాభిప్రాయం లేదు అనే ముద్ర వేయగలిగితే, అది వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి పెద్ద చీలికకు దారితీస్తుందని వారి నమ్మకం. క్యాడర్ స్థాయిలో గొడవలు మొదలైతే, అవి సహజంగానే పైస్థాయి నేతలపై ఒత్తిడి పెంచుతాయి. కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు, స్థానిక సీట్ల కోసం మూడు పార్టీల కార్యకర్తలు పోటీ పడుతుంటారు. అందరికీ అవకాశాలు కల్పించడం ఏ ప్రభుత్వానికైనా కష్టసాధ్యమైన పని. ఈ డిమాండ్ అండ్ సప్లై గ్యాప్‌ను వైసీపీ తన అనుకూలతగా మార్చుకోనుంది. కూటమి నేతల మధ్య ఈగో సమస్యలను రాజేయడం, ఒక పార్టీకి దక్కిన ప్రాధాన్యత మరో పార్టీకి దక్కలేదని ప్రచారం చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో కూటమి ఐక్యతను దెబ్బతీయడమే వైసీపీ ప్రస్తుత రాజకీయ ఎజెండా. వైసీపీకి ఇప్పుడు కావాల్సింది స్వంత బలం పెంచుకోవడం కంటే, శత్రువుల మధ్య బలహీనతను వెతకడమే. స్థానిక ఎన్నికల్లో గెలవడం ద్వారా వచ్చే ఫలితం కంటే, కూటమి పార్టీల మధ్య శాశ్వత పగ ను సృష్టించడమే వైసీపీ సాధించాలనుకుంటున్న అసలైన గెలుపు. చంద్రబాబు రాజకీయ చాణక్యం, పవన్ కళ్యాణ్ అంకితభావం ఈ వ్యూహాలను ఎలా తిప్పికొడతాయనేది వేచి చూడాలి.

# నెమ్మదిగా సాగుతున్న పనులు

## రెండో విడత భూసమీకరణపై నీలినీడలు

విజయవాడ, మార్చి 18,

ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి రాజధాని నిర్మాణం ప్రస్తుతం కీలక దశలో ఉంది. 2024లో పనులు పునఃప్రారంభమైన తర్వాత దాదాపు రెండేళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పురోగతిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమరావతిలో ఐకానిక్ భవనాలైన అసెంబ్లీ, హైకోర్టు మరియు సచివాలయ టవర్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సాధారణ మౌలిక సదుపాయాల పనుల్లో జాప్యం కనిపిస్తోంది. ముఖ్యంగా ట్రంక్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ లైన్ల వంటి పనులు అంచనా వేసిన దానికంటే నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో అమరావతి పనులు అనుకున్న విధంగా పూర్తవుతాయా లేదా అన్న సందేహం ప్రారంభమయింది. ఇది రెండో విడత భూసమీకరణ మీద ప్రభావం చూపిస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

ప్రధాన కాంట్రాక్టు సంస్థలు నిర్దేశించుకున్న లక్ష్యంలో కేవలం 10 నుండి 20 శాతం వరకు మాత్రమే భౌతిక పురోగతిని సాధించాయి. భారీ వర్షాలు, సాంకేతిక కారణాలు ఈ మందగమనానికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్ల అభివృద్ధి విషయంలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మొదటి విడతలో దాదాపు 33,000 ఎకరాలు ఇచ్చిన రైతులకు ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన ప్లాట్లు అందలేదు. ప్లాట్ల వద్ద రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం వంటి కనీస వసతులు లేకపోవడంతో ఆ ప్లాట్లు అమ్మకానికి గానీ, గృహ నిర్మాణాలకు గానీ అనుకూలంగా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దాదాపు 1,300 కోట్లు లేఅవుట్ల అభివృద్ధి కోసం కేటాయించినప్పటికీ, పనులు ఆశించిన వేగంతో జరగకపోవడం రైతుల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. రాజధానిని మరో 16,000 నుండి 20,000 ఎకరాల మేర విస్తరించాలని ప్రభుత్వం రెండో విడత భూసమీకరణను ప్రారంభించింది. అయితే, మొదటి విడతలో భూములిచ్చిన రైతులకు కలిగిన ప్రయోజనంపై స్పష్టత లేకపోవడంతో, కొత్తగా భూములిచ్చేందుకు రైతులు వెనుకాడుతున్నారు. వైకుంఠపురం, పెదమద్దూరు వంటి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నా, రైతుల నుంచి స్పందన తక్కువగా ఉంది. ముందు పాత పనులు పూర్తి చేయండి.. ఆ తర్వాతే కొత్త భూములు అడగండి అన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఈ కారణంగానే రెండో విడత భూసమీకరణ ప్రక్రియ మందగించిందన్న ప్రచారం జరుగుతోందిఅమరావతిలో క్వాంటం వ్యాలీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి భారీ ప్రాజెక్టుల ప్రకటనలు ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలు లేకపోవడం పెట్టుబడిదారులను ఆలోచనలో పడేస్తోంది. రాజధాని ప్రాంతంలో స్థిరాస్తి ధరలు పెరిగినప్పటికీ, వాస్తవంగా నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో కొనుగోలుదారులు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు. ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు , ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండిరూ. 15,000 కోట్ల వరకు నిధులు సమీకరించినప్పటికీ, ఆ నిధులను వేగంగా ఖర్చు చేసి పనులు పూర్తి చేయకపోతే ప్రాజెక్టు వ్యయం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ప్రస్తుతం నిర్దేశించుకున్న 2027-28 లక్ష్యాలను చేరుకోవాలంటే కేవలం భవనాలపైనే కాకుండా, రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది నిర్మాణ సంస్థలపై పర్యవేక్షణ పెంచి, రెండో విడత భూసమీకరణకు వెళ్లే ముందే మొదటి విడత ఫలితాలను కళ్లముందు చూపాల్సిన అవసరం ఉంది. అప్పుడే రెండో విడతలో భూములుఇచ్చేందుకు రైతులు మరింత ఆసక్తి చూపే అవకాశం ఉంది.

# ఏలూరు ఎంపీ ఇరికించారా... ఇరుక్కున్నారా..

ఏలూరు మార్చి 18, (

?హైదరాబాద్ మెయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్ కేసులో సంచలన వాస్తవాలు బయటికొస్తున్నాయి.. ఒక సాధారణ డిన్నర్ పార్టీ అని వెళ్ళిన ఏలూరు ఎంపీ తెలియకుండానే డ్రగ్ కేసులో ఇరుక్కుపోయారు. దీని వెనుక తీవ్రమైన కుట్ర కోణం ఉందనే వాదన తెరపైకి వచ్చింది. కనీసం సిగరెట్ కూడా తాగే అలవాటు కూడా లేని పుట్టా మహేష్ కుమార్ పై డ్రగ్స్ ఆరోపణలు రావడంతో అయన సన్నిహితులు, పార్టీ నేతలు విస్తుపోయారు. . ఒక వివాహ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉన్న ఎంపీ మార్గమధ్యంలో ఫార్మ్ హౌస్ లో ఉన్న ఒక స్నేహితుడిని కలిసేందుకు ఆగారు. ఎంపీ ఫామ్ హౌస్ కి వెళ్ళిన కొద్దిసేపటికి ఈగల్ టీమ్ పోలీసులు వచ్చి డ్రగ్స్ చెకింగ్ చేయాలని చెప్పి అక్కడ ఉన్న 11 మంది వద్ద పోలీసుల సమక్షంలోనే యూరిన్ శాంపిల్ తీసుకుని రాపిడ్ టెస్ట్ చేసారు. 10 నిమిషాల తర్వాత చేవెళ్ల డీసీపీ వచ్చి ఐదుగురికి పాజిటివ్ వచ్చిందని, పుట్టా మహేష్ కుమార్ సహా మిగిలినవారికి నెగెటివ్ వచ్చిందని స్పష్టంగా ప్రకటించిన విషయం అన్ని మీడియాలలో రావడం ప్రజలంతా దానిని చూడటం అందరికి తెలిసిన విషయమే. చేవెళ్ల డీసీపీ ఏలూరు ఎంపీ వద్దకు వచ్చి మీకు నెగటివ్ వచ్చింది, మీరు కొద్దిసేపటిలో మిమ్మలిని పంపించేస్తామని కూడా చెప్పినట్లు సమాచారం. అసలైన ట్విస్ట్ ఇక్కడే మొదలయింది. ఇంతలో ఎస్పీ గిరిధర్ రంగప్రవేశం చేసారు. పుట్టా మహేష్ కు యూరిన్ టెస్ట్ లో నెగటివ్ వచ్చిన రిపోర్ట్ ను పోలీసులు ఎస్పీ ముందుంచారు. రిపోర్ట్ ను చూసిన ఎస్పీ అక్కడనుంచే ఎవరితోనో ఫోన్ లో మాట్లాడారు. మాట్లాడుతూ తలసాని శ్రీనివాస్ గారి అల్లుడు ఉన్నాడని ఫోన్ లోనే అవుతలి వ్యక్తులకు చెప్పారని తెలుస్తోంది . ఈ మాటలు అక్కడ అందరు వింటూనే ఉన్నట్లు కూడా సమాచారం . ఆ మాటలు వింటూనే ఉన్న ఎంపీ పుట్టా మహేష్.. నేను తలసాని అల్లుడిని కాదని తెలపటానికి ప్రయత్నించినట్టు తెలిసింది. కానీ ఎస్పీ ఆ మాటలు ఏవి పట్టించుకోకుండా ఫోన్ పెట్టేసిన తర్వాత మరొక ఫోన్ కూడా మాట్లాడారు. అనంతరం పోలీసులవేపు తిరిగి, యూరిన్ టెస్ట్ కచ్చితమైన రిజల్ట్ రాదు, బ్లడ్ టెస్ట్ కూడా చేస్తేనే కచ్చితమైన రిజల్ట్ వస్తుందని చెప్పి, నెగటివ్ వచ్చిన వాళ్ళతో సహ వీరందరిని ఇక్కడే ఉంచండి, బ్లడ్ శాంపిల్స్ కోసం పంపించాలని చెప్పి పక్కకు వెళ్లిపోయారు. ఎస్పీ ఆదేశాల మేరకు తెల్లవారుజామున 3 గంటల సమయంలో 11

మందిని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఇక్కడే అసలైన మాయ జరిగింది. తీసుకెళ్లింది బ్లడ్ సాంపిల్స్ కోసం.. కానీ అక్కడ తీసుకుంది మళ్ళీ యూరిన్ శాంపిల్స్ మాత్రమే. ఇక్కడ కూడా 10 మంది యూరిన్ సాంపిల్స్ ఒక వైపుగా తీసుకెళ్లారు. కానీ ఎంపీ పుట్టా మహేష్ యూరిన్ శాంపిల్ మరోవైపు పంపినట్లు సమాచారం. అనంతరం ఈ 11 మందిని శంషాబాద్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. రెండవ సారి యూరిన్ సాంపిల్స్ తీసుకున్న సుమారు 5 గంటల తర్వాత, అంటే సుమారు ఉదయం 9 గంటల సమయంలోఈగల్ ఎస్పీ మీడియా ముందుకు వచ్చి, బ్లడ్ శాంపిల్స్ లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు పాజిటివ్ వచ్చిందని

ప్రత్యేకంగా ప్రకటించారు. ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే మొదటిసారి చేసిన యూరిన్ టెస్ట్ రిపోర్ట్ ను 10 నిమిషాల్లో బయటికి చెప్పగా రెండవ సారి చేసిన యూరిన్ టెస్ట్ రిపోర్ట్ 5 గంటల తర్వాత బయట పెట్టడం. ఇక్కడే ఖచ్చితంగా కుట్ర కోణం ఉందని అనుమానాలు బలపడుతున్నాయి. ఇక్కడ అసలైన, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బ్లడ్ శాంపిలే తీసుకోకుండా, బ్లడ్ రిపోర్ట్ పాజిటివ్ గా వచ్చిందని ఈగల్ ఎస్పీ ప్రకటించడం. చివరికి రిమాండ్ రిపోర్టులో కూడా ఎక్కడ కూడా బ్లడ్ టెస్ట్ ప్రస్తావన లేదు. కేవలం యూరిన్ టెస్టు అని మాత్రమే ఉంది. మరి బ్లడ్ టెస్ట్ చేయకుండానే పాజిటివ్ వచ్చింది అని ఎస్పీ ఎలా చెప్పారు ? ఇక్కడ అనేక సందేహాలు.. అనేక అనుమానాలు... పాజిటివ్ వచ్చింది యూరిన్ టెస్ట్ లోనా? లేదా బ్లడ్ టెస్ట్ లోనా? ఏలూరు ఎంపీ యూరిన్ శాంపిల్ ఎక్కడికి తీసుకెళ్లారు? పాజిటివ్ రావడం కోసం అందులో ఏదైనా కలిపారా? అయితే ఏలూరు ఎంపీ పై డ్రగ్ ముద్ర వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించిన ఎస్పీ గిరిధర్ ఒకచోట పప్పులో కాలువేసారు. అదే.. బ్లడ్ టెస్ట్ లో ఏలూరు ఎంపీ కి పాజిటివ్ వచ్చిందని చెప్పడం. ఇక్కడే కచ్చితమైన కుట్ర ఉందని, ఇందులో ఈగల్ ఎస్పీ గిరిధర్ పాత్ర ఉందని అనుమానాలకు బలం చేకూరుతోంది . బ్లడ్ శాంపిల్ తీసుకోకుండానే, బ్లడ్ రిపోర్టులో పాజిటివ్ వచ్చిందని చెప్పిన ఎస్పీ, అదే నిజమైతే బ్లడ్ శాంపిల్ రిపోర్టు బయటపెట్టాలి.పోలిసు విచారణ ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత ఎంపీ రెండు గుర్తింపు పొందిన ప్రముఖ ల్యాబుల్లో ?సొంతంగా యూరిన్ టెస్టు చేయించినట్లు తెలిసింది. .. ఆ రిపోర్టు కాపీలను కూడా మనకు

దొరికాయి. వీటిలో "నెగెటివ్" గా రిపోర్టు రావడం మీరు చూడొచ్చు... వీటితోపాటు, ఎంపీ పై కుట్ర కోణం అనుమానాలు రేగటానికి మరో బలమైన కారణం ఉంది.అదే, ఎంపీ ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం. ఇది కూడా మనకు వచ్చింది.నాలుగేళ్ళ కిందట ఎంపీకి హార్ట్ ఆపరేషన్ జరిగింది. దీనికి సంబంధించిన రిపోర్టులు కూడా ఉన్నాయిఅయన ఇప్పటికీ రెగ్యులర్ గా మందులు వాడుతున్నారు. గుండె సమస్య ఉన్న వ్యక్తి కొకైన్ లాంటి డ్రగ్స్ వాడటం సాధ్యమేనా? సాధారణ మనిషి గుండె నిమిషానికి 70 నుంచి 100 సార్లు కొట్టుకుంటుంది. డ్రగ్స్ తీసుకున్నప్పుడు 150 నుంచి 200 వరకూ వెళ్ళిపోతుందని వైద్యులు చెబుతారు... మరి గుండె సమస్య ఉన్న వ్యక్తి డ్రగ్స్ తీసుకోవడం ఏ విధంగా సాధ్యం?

ఇప్పుడు తేలాల్సిన విషయాలు

1) ఎంపీ పై డ్రగ్ ముద్ర వేయాలనే కుట్ర వెనుక ఎవరున్నారు?

2) అసలు తలసాని అల్లుడు అని తెలుసుకున్న తర్వాతే ఎస్పీ 2వ సారి టెస్ట్ కు ఆదేశించారా? దానికి కారణం ఏంటి?

3) ఎస్పీ ఏలూరు ఎంపీ గురించి.. తలసాని అల్లుడు అంటూ ఫోన్ లో చెప్పిందెవరికి?

4) పాజిటివ్ వచ్చింది యూరిన్ టెస్ట్ లోనా? లేదా బ్లడ్ టెస్ట్ లోనా?

5) 2వ సారి కూడా యూరిన్ టెస్ట్ చేసి, బ్లడ్ టెస్ట్ లో పాజిటివ్ వచ్చిందని ఎందుకు చెప్పాల్సివచ్చింది?

6) అసలు బ్లడ్ టెస్ట్ చేస్తే రిమాండ్ రిపోర్ట్ లో, ఈఎఫ్ఐ లో బ్లడ్ టెస్ట్ గురించి ఎందుకు రాయలేదు.

7) కొకైన్ తీసుకున్నారని ఒక పక్క పోలీసులు చెబుతూ, ఈఎఫ్ఐ లో కొకైన్ తీసుకున్న ఆనవాళ్లు లేవని చెప్పటం కుట్ర కాదా?

8) యాంఫిటమిన్ , మెథా యాంఫిటమిన్ వంటి ఆనవాళు ఏవిధంగా నిర్ధారించారు ?

9) గుండె సంబంధిత, ఒబెసిటీ, డిప్రెషన్ వంటి ఇతర ఆరోగ్య సమస్యలకు వాడే మందుల వాళ్ళ కూడా యాంఫిటమిన్ , మెథా యాంఫిటమిన్ వంటి ఆనవాళ్లు కనిపించే అవకాశం ఉందని తెలిసి కూడా డ్రగ్స్ తీసుకున్నారని ఎలా ప్రకటించారు ?

10. గుండె ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి కొకైన్ లాంటి డ్రగ్ తీసుకుంటే బతుకుతాడా?

11. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ పై చేసిన కుట్ర వెనుక అసలు సూత్రధారులెవరు? పాత్రధారులెవరు?

12. రాజకీయ చదరంగంలో చేయని నేరానికి ఏలూరు ఎంపీ బలయ్యారా?

# ట్రాప్‌లో వైసీపీ పడిందా

కాకినాడ, మార్చి 18,

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇటీవల జరిగిన రెండు భారీ మానవ తప్పిదాలు రాష్ట్రాన్ని కుదిపేశాయి. వేట్లపాలెం బాణసంచా ప్రమాదంలో 28 మంది, రాజమండ్రి కల్తీ పాలు సేవించి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం 42 కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చిన ఈ ఘటనలు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా వైసీపీ ఈ ఘటనల పట్ల స్పందించిన తీరు, పార్టీ అగ్ర నాయకత్వం వహించిన మౌనం ఇప్పుడు ఆ పార్టీలోనే అంతర్గత మథనానికి కారణమవుతోంది.వేట్లపాలెంలో బాణసంచా తయారీలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల 28 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరోవైపు, రాజమండ్రిలో కల్తీ పాల సరఫరా కారణంగా మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ 14కు చేరింది. ఈ ఘోరాలు జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా బాధితులను పరామర్శించి అండగా ఉ ంటామని భరోసా ఇచ్చారు.ఇంతటి భారీ స్థాయిలో ప్రాణనష్టం జరిగినప్పుడు, ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ దూకుడుగా వ్యవహరించాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో బాధితులకు భరోసా ఇవ్వడంలో పార్టీ విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయంగా వచ్చి బాధితులను పరామర్శించి ఉంటే బాగుండేదని పార్టీ శ్రేణులే అభిప్రాయపడుతున్నాయి. గతంలో పిఠాపురంలో ఇలాంటి ప్రమాదం జరిగినప్పుడు జగన్ స్వయంగా వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మరి ఇప్పుడు అంతకంటే పెద్ద ప్రమాదం జరిగినా ఎందుకు స్పందించలేదనేది ప్రశ్నార్థకంగా

మారింది.అయితే ఈ ఘటనలపై జగన్ కు సరైన సమాచారం లేదని కొంమంది చెప్తున్నారు. తాము జరిగిన విషయాన్ని ఎప్పటికప్పుడు పార్టీ పెద్దలకు వివరించామని, నిర్ణయం తీసుకోవాల్సింది పైస్థాయి నాయకత్వమేనని జిల్లా నేతలు వాదిస్తున్నారు. అయితే.. జిల్లా నేతలు కేవలం సమాచారం ఇచ్చి వదిలేయకుండా, పదే పదే గుర్తు చేసి ఉండాల్సిందని, వారిలో చొరవ లోపించిందని పార్టీ పెద్దలు విమర్శిస్తున్నారు. ఇక్కడ మరో వాదన కూడా వినిపిస్తోంది. గోదావరి జిల్లాల్లో పార్టీ పెద్దగా యాక్టివ్ గా లేదని, కేడర్ మొత్తం చిన్నాభిన్నమైందని కొందరు చెప్తున్నారు. అందుకే ఈ జిల్లాకు రావడానికి జగన్ ఇష్టపడలేదని పార్టీలోని కొన్ని వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఈ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారు, ప్రభావితమైన వారు వైసీపీకి బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న సామాజిక వర్గాలేనని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. రాష్ట్రంలో ఇతర పెద్ద

రాజకీయ అంశాలు లేని సమయంలో కూడా, ప్రభుత్వం విఫలమైన కోణాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైసీపీ ఆలస్యం చేసిందని పార్టీ వర్క్ షాప్ లో కూడా చర్చకు వచ్చింది.రాజకీయాలను పక్కన పెడితే, ఇంతటి భారీ మానవతా సంక్షోభం ఏర్పడినప్పుడు ప్రజల పక్షాన నిలవాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉంటుంది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నా, కమ్యూనికేషన్ లోపాలు లేదా వ్యూహాత్మక తప్పిదాల వల్ల వైసీపీ ఈ విషయంలో వెనకబడిందనేది స్పష్టమవుతోంది

# కేరళలో కమలం కొత్త మంత్రం...

తిరువనంతపురం, మార్చి 18

కేరళ రాజకీయాల్లో పాగా వేయాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ, అక్కడ కేవలం హిందూత్వ కార్డుతోనే విజయం సాధించలేమని గుర్తించి, వ్యూహాత్మకంగా తన రూటు మార్చింది. ముఖ్యంగా రాష్ట్ర జనాభాలో దాదాపు 18-20 శాతం ఉన్న క్రైస్తవులను ఆకర్షించేందుకు క్రిస్టియన్ మంత్రం పఠిస్తోంది.కేరళలో దశాబ్దాలుగా క్రైస్తవ సమాజం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కి వెన్నెముకగా ఉంటూ వస్తోంది. అయితే, ఇటీవల ముస్లిం లీగ్ ప్రభావం యూడీఎఫ్‌లో పెరిగిందన్న భావన క్రైస్తవుల్లో ఒక రకమైన అసంతృప్తిని కలిగిస్తోంది. దీనిని ఆసరాగా చేసుకున్న బీజేపీ, క్రైస్తవులను తనవైపు తిప్పుకోవడం ద్వారా కాంగ్రెస్ పునాదులను దెబ్బతీయాలని చూస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిసూర్ విజయం , సురేష్ గోపీకి లభించిన క్రైస్తవ ఓట్ల మద్దతు ఈ వ్యూహం ఫలిస్తున్నదని బీజేపీ బలంగా నమ్ముతోంది.ముస్లిం జనాభా పెరుగుదల, వక్ఫ్ బోర్డు భూముల వివాదాస లవ్ జిహాద్ వంటి అంశాలపై క్రైస్తవ సమాజంలో ఉన్న ఆందోళనలను బీజేపీ తన రాజకీయాస్త్రాలుగా మలుచుకుంటోంది. ఈ అంశాల్లో క్రైస్తవ మత పెద్దలకు మద్దతుగా నిలవడం ద్వారా, మీ ప్రయోజనాలను రక్షించేది మేమే అనే సంకేతాన్ని పంపిస్తోంది. ముఖ్యంగా కాథలిక్ చర్చిలోని కొన్ని వర్గాలు ఇటీవల బీజేపీ వైపు మొగ్గు చూపడం, ఆర్ఎస్ఎస్ ( నేతలు బిషప్‌లతో చర్చలు జరపడం ఈ సామాజిక ఇంజనీరింగ్ లో భాగమే.కేవలం మాటలకే పరిమితం కాకుండా, పార్టీ పదవుల్లో క్రైస్తవులకు పెద్దపీట వేస్తోంది. కేంద్ర మంత్రిగా జార్జ్ కురియన్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనిల్ ఆంటోనీ వంటి వారిని ముందుంచడం ద్వారా క్రైస్తవ వ్యతిరేక

పార్టీ అనే ముద్రను చెరిపేసే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అధిక సంఖ్యలో క్రైస్తవ అభ్యర్థులను నిలబెట్టాలని, తద్వారా ప్లాన్-బి కింద క్రైస్తవ ప్రాబల్యం ఉన్న మధ్య కేరళలో పట్టు సాధించాలని ప్లాన్ చేస్తోంది. ప్రజల్లోకి వెళ్లేందుకు బీజేపీ స్నేహయాత్ర వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టింది. క్రిస్మస్, ఈస్టర్ పండగల సమయంలో బీజేపీ నేతలు చర్చిలను సందర్శించడం, క్రైస్తవ కుటుంబాల ఇళ్లకు వెళ్లి మోదీ ప్రభుత్వ పథకాలను వివరించడం వంటివి క్షేత్రస్థాయిలో మార్పు తెస్తున్నాయి. ముఖ్యంగా రబ్బర్ ధరల పతనం వంటి ఆర్థిక అంశాలపై కేంద్రాన్ని ఒప్పించి రైతులకు మేలు చేస్తామని హామీ ఇవ్వడం ద్వారా కేరళలోని సిరో-మలబార్ చర్చి మద్దతును పొందేందుకు గట్టి ప్రయత్నం చేస్తోంది.బీజేపీ వ్యూహానికి కొన్ని ప్రధాన సవాళ్లు కూడా ఉన్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో క్రైస్తవ మిషనరీలపై జరుగుతున్న దాడులు, మణిపూర్ హింసాకాండ వంటి అంశాలను ఇతర పార్టీలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. ఒకవైపు ఇక్కడ స్నేహం నటిస్తూనే, మరోవైపు దాడులు చేస్తున్నారు అనే ప్రచారాన్ని క్రైస్తవ సమాజంలోకి తీసుకెళ్లడంలో ప్రతిపక్షాలు కొంతవరకు సఫలమవుతున్నాయి. ప్రస్తుతానికి బీజేపీ వేస్తున్న అడుగులు కేరళలో త్రిముఖ పోటీకి తెరలేపాయి. క్రైస్తవ ఓట్లలో కనీసం 10-15 శాతం చీల్చగలిగినా, అది ఎల్డీఎఫ్ లేదా యూడీఎఫ్ ల గెలుపోటములను శాసిస్తుంది. . బహిరంగంగా బీజేపీని వ్యతిరేకించే క్రైస్తవులు కూడా రాస్యంగా ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికలే బీజేపీ ఈ క్రైస్తవ మంత్రం ఎంతవరకు పారిందో తేల్చే అసలైన తీర్పు కానున్నాయి.

# కథ కంచికేనా...

కడప, మార్చి 18,

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి మృతిపై ఇక ఏమీ తేలదు. ఇప్పటికి ఇంతే. సీబీఐ కూడా సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు ముగిసిందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ కేసులో కొత్తగా ఎవరినీ నిందితులుగా చేర్చలేదని, అదనపు ఆధారాలు లభించలేదని నివేదించింది. ట్రయల్ కోర్టు లో విచారణను వేగవంతం చేసి, నాలుగు వారాల్లోగా ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, ఈ కేసులో నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలన్న విజ్ఞప్తులను సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీంతో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత పోరాటం కూడా ముగిసినట్లేనని అనుకోవాలి. ఇక వైఎస్ వివేకా మృతిలో మిస్టరీ వీడే అవకాశం లేనట్లే కనిపిస్తుంది.వైఎస్ వివేకా మృతి జరిగి ఏడేళ్లు కావస్తుంది. గొడ్డలి పోట్లు ఉండటంతో అది హత్య అని అందరూ ఆరోపించు. ఇప్పటి వరకూ హత్యకు గల కారణాలు.. హత్య చేసిందెవరన్నది తేల్చలేకపోయారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత ఒంటరి పోరాటం చేస్తున్నారు. న్యాయ పోరాటం చేశారు. ఈ హత్య కేసులో ఆధారాలు లభించలేదా? లేక ఆధారాలను చెరిపేయడంతో విచారణలో అసలు వాస్తవాలు బయటకు రావడం లేదా? మరి దేశంలోనే అనేక క్లిష్టమైన కేసులను పరిష్కరించిన సీబీఐ వల్ల కూడా కాలేదంటే అసలు ఈ కేసు ఇక మూలనపడినట్లేనని అంటున్నారకు.ఒక హత్య జరిగితే వెంటనే దానికి గల కారణాలను, నిందితులను ఎక్కడున్నా పట్టుకునే దర్యాప్తు అధికారులు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మిస్టరీని ఎందుకు ఛేదించలేకపోతున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి ఆధారాలున్నా.. ఏమాత్రం సాంకేతికమైన చిన్నపాటి క్లూ లు లభించినా దర్యాప్తు అధికారులు వదిలిపెట్టే ప్రశ్న ఉండదు. కానీ వివేకానంద రెడ్డి హత్య జరిగింది 2019లో. ఏడేళ్లుగా కుమార్తె డాక్టర్ సునీత పోరాటం చేస్తుంది. కానీ హత్యకు గల కారణాలు కూడా తెలియరాలేదు. ఇక నిందితులెవరూ లేరని, అందుకు తగిన ఆధారాలు లభించలేదని చెప్పడంతో వైఎస్ వివేకా హత్య కేసు ఎప్పటికీ మిస్టరీగానే మిగిలిపోనుంది.వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అనేక విషయాలు గత ఏడేళు గా ప్రచారంలో ఉన్నాయి. వాటిలో నిజానిజాలు ఆ భగవంతుడికే తెలియాలి. వాటికి ఎటువంటి ఆధారాలు లేవు. ఒక మాజీ ముఖ్యమంత్రి సోదరుడు, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురయి ఇన్నేళ్లవుతున్నా కనీసం హత్యకు గల కారణాలను బయట ప్రపంచానికి తెలియకపోవడంతో ఇక దర్యాప్తు సంస్థలపై కూడా ప్రజలకు దురభిప్రాయం ఏర్పడే అవకాశముంది. అలాంటి వారికే న్యాయం జరగనప్పుడు ఇక సామాన్యులకు సరైన న్యాయం ఎందుకు జరుగుతుందన్న ప్రశ్న సహజంగా తలెత్తుతుంది. వైఎస్ వివేకానందరెడ్డిది సహజ మరణం కాదు.కానీ అందుకు గల కారణాలు ఇప్పటి వరకూ తెలియకపోవడం మాత్రం దురదృష్టకరమే.

# కేసీఆర్ వస్తేనే అసెంబ్లీలో రేవంత్‌కు అసలు సవాల్ !

హైదరాబాద్, మార్చి 18

తెలంగాణ అసెంబ్లీ ప్రాజస్వామ్య చర్చలు జరుగుతున్నా..ఏదో లోటు కనిపిస్తోంది. సమఉజ్జీల మధ్య పోరు సాగితేనే ఆసక్తికరంగా ఉంటుంది. హరీష్ రావు, కేటీఆర్ వంటి వారికి కాంగ్రెస్ మంత్రులు జోరుగా సమాధానం ఇస్తున్నారు. హరీష్ కు గతంలో రేవంత్ సమాధానం ఇచ్చేవారు కానీ.. కేటీఆర్ ఇంకా మంత్రుల దాడినికూడా తట్టుకోలేకపోతున్నారు. అసలు హోరాహోరీ పోరు అనేది కేసీఆర్ సభకు వచ్చినప్పుడే ఉంటుంది. ఆయన ప్రసంగాలు.. రేవంత్ కౌంటర్లు.. చూస్తే పాత కాలం గుర్తుకు వస్తాయి. కానీ కేసీఆర్ రావడం లేదు.తెలంగాణ అసెంబ్లీ అంటేనే ఒకప్పుడు మేధోమథనం, చురకలు, గంభీరమైన ప్రసంగాలకు నిలయం. కేసీఆర్ మార్కు

రాజకీయ వ్యూహాలు సభలో ప్రత్యేకం. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో హరీష్ రావు, కేటీఆర్ వంటి హేమాహేమీలు ప్రతిపక్షం నుంచి గళమెత్తుతున్నప్పటికీ, ఎక్కడో ఒక వెలితి స్పష్టంగా కనిపిస్తోంది. హరీష్ రావు వేసే ప్రశ్నలకు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు ధీటుగానే బదులిస్తున్నా, సభలో ఉండాల్సిన ఆ హోరాహోరీ పోరు మాత్రం మిస్ అవుతోంది. కేటీఆర్ సైతం మంత్రుల సమిష్టి దాడిని తట్టుకోవడంలో అప్పుడప్పుడూ ఇబ్బంది పడుతుండటం గమనార్హం.నిజానికి సభలో అసలైన సమరమంటే.. అది కేసీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డి అన్నట్లుగా ఉండాలి. వీరిద్దరి మధ్య సాగే వాదోపవాదాలు, పరస్పర కౌంటర్లు పాత రోజుల్లోని దిగ్గజ నేతల మధ్య పోరును

గుర్తుకు తెస్తాయి. కేసీఆర్ తనదైన శైలిలో గణాంకాలను వల్లెవేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, దానికి రేవంత్ రెడ్డి అంతే వేగంగా గన్ మార్క్ సమాధానం ఇవ్వడాన్ని అందరూ కోరుకుంటారు. సమఉజ్జీల మధ్య పోరు సాగితేనే ప్రజాస్వామ్య చర్చలు ఆసక్తికరంగా ఉంటాయన్నది కాదనలేని వాస్తవం. రోజులు గడుస్తున్న కొద్దీ కేసీఆర్ రాకపై అంచనాలు కూడా మసకబారుతున్నాయి. ప్రారంభంలో ఆయన ఎప్పుడు వస్తారా అని ఎదురుచూసిన రాజకీయ వర్గాలు, ఇప్పుడు ఆయన గైర్హాజరీని ఒక అలవాటుగా మార్చుకున్నాయి. కేసీఆర్ రావడం లేదనే విషయాన్ని అధికార పక్షం లైట్ తీసుకుంటుండగా, ప్రతిపక్షం కూడా ఆయన లేకుండానే నెట్టుకొచ్చే ప్రయత్నం చేస్తోంది.ప్రజాస్వామ్యంలో పదునైన విమర్శలు, అంతకంటే పదునైన సమాధానాలు ఉన్నప్పుడే శాసనసభ గౌరవం పెరుగుతుంది. ఇప్పుడు మంత్రులు జోరు చూపిస్తున్నా, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అక్కడ లేకపోవడం వల్ల చర్చలు ఏకపక్షంగా మారుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేసీఆర్ మళ్లీ సభలో అడుగుపెట్టి తన గంభీర స్వరంతో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్ప, తెలంగాణ అసెంబ్లీకి ఆ పాత కళ రాదనేది విశ్లేషకుల మాట. మరి ఈ నిశ్శబ్ద విరామం ఎప్పుడు ముగుస్తుందో, ఆ హోరాహోరీ పోరు మళ్లీ ఎప్పుడు మొదలవుతుందో వేచి చూడాలి.

=======================

# డ్రగ్స్ కథా చిత్రమ్...
# రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు.. మత్తు పార్టీలు!

హైదరాబాద్, మార్చి 18,

హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ కేసు కొత్త మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో డ్రగ్స్ పాజిటివ్‌గా తేలిన వారికి గతంలోనూ డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఆయన స్నేహితుడు నమిత్‌శర్మలకు ఇటీవల నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో పార్టీలో వాడిన కొకైన్‌తో పాటు మరికొన్ని డ్రగ్స్ అవశేషాలు లభించడం సంచలనం రేపుతోంది. దాంతో వీరికి గతంలోనే డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉందని డ్రగ్స్ రిపోర్ట్ బలపరుస్తున్నాయి. దాంతో వీరి డ్రగ్స్ అలవాటుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పార్టీలో పాల్గొన్న 11 మందిలో ఆరుగురికి డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ శాంపిల్స్ లోనూ యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ లభించాయి. ముఖ్యంగా పోలీసులపై కాల్పులు జరిపిన నమిత్‌శర్మ నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు గుర్తించారు. శనివారం నాటి పార్టీలో కేవలం కొకైన్ మాత్రమే వాడినట్లు ప్రాథమికంగా తేలినప్పటికీ, వీరి రక్తంలో ఇతర డ్రగ్స్ ఆనవాళ్లు ఉండటం చూస్తుంటే, వీరు గతంలోనూ ఇతర డ్రగ్స్ సేవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు, బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి తాను శిమ్లా నుంచి రూ. 15 వేల విలువైన కొకైన్ తెచ్చానని ఒప్పుకున్నాడు. అయితే, పోలీసులు స్వాధీనం 0.26 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ పాజిటివ్ గా తేలిన వారు అప్పటికే కొకైన్ వాడారని, కౌశిక్ రవి చెప్పిన దానికంటే ఎక్కువ మొత్తంలోనే డ్రగ్స్ తెచ్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అయితే శిక్ష నుంచి తప్పించుకునేందుకు తక్కువ మోతాదులో డ్రగ్స్ తెచ్చినట్లు తెలుస్తోంది. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు పాత



రికార్డులను పరిశీలిస్తున్నారు. ఒకరు బెంగళూరుకు చెందిన లాయర్, మరొకరు రాజస్థాన్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఏలూరు ఎంపీ, తాండూరు మాజీ ఎమ్మెల్యే ఇలా పలు రాష్ట్రాలు, పలు వృత్తుల్లో ఉన్నవారు మత్తు పార్టీలతో ఫ్రెండ్స్ అయినట్లు పోలీసుల విచారణలో తేలింది. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో ఓ మహిళ సహా 11 మందిని మొదట అదుపులోకి తీసుకున్నారు. అయితే వీరంతా వేరే ప్రొఫెషన్ లో ఉన్నప్పటికీ రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్ల కోసమే తరచూ కలుస్తుంటారని, ఈ క్రమంలో డ్రగ్స్ పార్టీకి ప్లాన్ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో మొత్తం 11 మందిని నిందితులుగా చేర్చారు. ఇందులో ఏ-1గా నమిత్ శర్మ కాగా, ఏ-2గా రోహిత్ రెడ్డి, ఏ-3గా రితేష్ రెడ్డి సహా మొత్తం నిందితులపై ఎన్డీపీఎస్ చట్టంతో పాటు ఆర్మ్స్ యాక్ట్, తెలంగాణ ఎక్సైజ్ చట్టం, భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మార్చి 14 తెల్లవారుజామున నిందితులను అరెస్ట్ చేయగా 8 మంది బెయిల్ రావడంతో విడుదలయ్యారు. రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్ గూడ జైలుకు తరలించారు.

# జగ్గారెడ్డికి పీసీసీ సాధ్యమేనా

హైదరాబాద్, మార్చి 18,



తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అంతర్గత పరిణామాల్లో ఎప్పుడూ ఏదో ఒక ఆసక్తికర చర్చ జరుగుతూనే ఉంటుంది. తాజాగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. టీపీసీసీ అధ్యక్ష పదవికి జగ్గారెడ్డి సరైన అభ్యర్థి అని, ఆయనకు ఆ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. "జగ్గారెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించాలి. ఆయన ఒక మాస్ లీడర్. ప్రజల్లో ఉంటూ, ప్రజల కష్టాలను తీర్చే నాయకుడు" అని ఆయన పేర్కొన్నారు. కేవలం కోమటిరెడ్డే కాకుండా, మరో సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గతంలో జగ్గారెడ్డిపై ప్రశంసలు కురిపించడం గమనార్హం. జగ్గారెడ్డిని కోమటిరెడ్డి 'మరో పీజేఆర్' అని అభివర్ణించారు. హైదరాబాద్ రాజకీయాల్లో పీజేఆర్ ఎలాగైతే పేదల పెన్నిధిగా పేరు తెచ్చుకున్నారో, జగ్గారెడ్డి కూడా అదే తరహాలో ఆపదలో ఉన్నవారికి తక్షణమే స్పందిస్తారని కోమటిరెడ్డి చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉండేవారికి ప్రజలతో మమేకమయ్యే గుణం ఉండాలని, అది జగ్గారెడ్డిలో పుష్కలంగా ఉందని ఆయన వాదన. జగ్గారెడ్డికి పీసీసీ పగ్గాలు అప్పగిస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా 100 సీట్లు వస్తాయని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కేడర్‌ను ఉత్సాహపరచడంలో, ప్రత్యర్థులపై గట్టిగా విరుచుకుపడటంలో జగ్గారెడ్డికి ప్రత్యేక శైలి ఉంది. ఈ దూకుడు స్వభావం పార్టీకి క్షేత్రస్థాయిలో మేలు చేస్తుందని సీనియర్ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు కొత్తేమీ కాదు. అయితే, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి ఉద్ధండులు జగ్గారెడ్డి పేరును ప్రతిపాదించడం వెనుక ఒక వ్యూహం కనిపిస్తోంది. సీనియర్లందరినీ కలుపుకుని పోయే సత్తా, అదే సమయంలో అధిష్టానం వద్ద గట్టిగా మాట్లాడగలిగే చొరవ జగ్గారెడ్డికి ఉన్నాయని వారు నమ్ముతున్నారు. పీసీసీ అధ్యక్షుడి ఎంపిక అనేది పూర్తిగా ఏఐసీసీ పరిధిలోని అంశం. పైగా ఇటీవలే మహేశ్ కుమార్ గౌడ్ కు పీసీసీ పగ్గాలు అప్పగించింది అధిష్టానం. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యే వరకూ పీసీసీ పీఠం రేవంత్ రెడ్డి దగ్గర ఉండేది. ఆ తర్వాత మహేశ్ గౌడ్ కు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు పీసీసీని మారుస్తారని ఆశించడం అత్యాసే అవుతుంది. అయితే కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి లాంటి నేతలు జగ్గారెడ్డి కోసం ప్రయత్నిస్తున్నట్టు అర్థమవుతోంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు వరకూ ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకించారు జగ్గారెడ్డి. ఆయనపై ఎన్నోసార్లు నేరుగా విమర్శలు కూడా గుప్పించారు. అలాంటి వ్యక్తికి రేవంత్ రెడ్డి సీఎంగా ఉండగా పీసీసీ బాధ్యతలు అప్పగిస్తారా అనేది అనుమానమే. పైగా సీఎం సీట్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉన్నప్పుడు, పీసీసీని మరో రెడ్డి ఇస్తారని ఆశించడం కూడా అత్యాశే. కాబట్టి ఇప్పటికిప్పుడు పీసీసీలో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. కాలం కలిసొస్తే జగ్గారెడ్డికి ఎమ్మెల్సీ లేదా సలహాదారు పదవి లాంటివి ఇవ్వొచ్చేమో కానీ పీసీసీ మాత్రం దక్కకపోవచ్చు. మొత్తానికి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త చర్చకు తెరలేపాయి. జగ్గారెడ్డిని 'మానవత్వం ఉన్న మనిషి'గా, 'ధైర్యవంతుడైన నాయకుడి'గా చిత్రించడం ద్వారా ఆయనకు పార్టీ పగ్గాలు అప్పగించాలనే డిమాండ్‌ను కోమటిరెడ్డి బలంగా వినిపించారు. అయితే.. ఇప్పట్లో ఆయన కోరిక నెరవేరకపోవచ్చు.

# ఫేజ్ 1కు 7వేల కోట్ల అంచనా


హైదరాబాద్, మార్చి 18,

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ నదిపై తొమ్మిది వంతెనలను నిర్మిస్తుంది. ఇప్పటికే ఉన్న ఐదు వంతెనలను అప్‌గ్రేడ్ చేస్తుంది. అలాగే ప్రణాళిక ఫేజ్ 1లో భాగంగా మూడు నీటి నిలుపుదల బ్యారేజీలను నిర్మిస్తుందని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలో పేర్కొంది. ఫ్రంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహ రెడ్డి సమర్పించిన ప్రతిపాదనలు.. ఓఆర్ఆర్ పరిమితుల్లోని నది ప్రతిపాదిత 55 కిలోమీటర్ల విస్తీర్ణంలో 21 కిలోమీటర్లను రెండు జోన్ లుగా విభజించాయి. కొన్ని నిర్మాణాలు తక్కువ ఎత్తులో ఉన్న కాజ్‌వేలు అని, వీటిని పైకి ఎత్తాల్సిన అవసరం ఉందని, దానిని కూడా ప్రాజెక్ట్ కింద తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఉస్మాన్‌సాగర్ నుండి తూర్పు వైపు ఉత్తర ఒడ్డున ఉన్న జోన్ 1బీ, కొత్త నిర్మాణాలలో ఎక్కువ భాగాన్ని కలిగి ఉంది. ఇందులో ఆరు వంతెనలు ఉన్నాయి. గండిపేట వంతెన రిజర్వాయర్ అంచున నిర్మిస్తారు. గోశాల నుండి గ్రేహౌండ్స్‌కు క్రాసింగ్ వంతెన, నర్సింగ్గి వద్ద ఓఆర్ఆర్‌పై వంతెన, జోన్ మధ్య భాగంలో బైరాగిగూడ వంతెన, రామ్‌దేవ్‌గూడ వంతెన, మూసా నవిూపంలోని గాంధీ సరోవర్ వద్ద వంతెన పనులు జరుగుతున్నాయి. జోన్ 1ః లోని రెండు వంతెనలను అప్‌గ్రేడేషన్ కోసం ప్రతిపాదించారు: ఒకటి మంచిరేవుల వద్ద మరియు మరొకటి ఇబ్రహీం చెరువు వద్ద, ఇవి తక్కువ ఎత్తులో ఉన్న కాజ్‌వేలు. హిమాయత్‌సాగర్ వైపున ఉన్న దక్షిణ కారిడార్ అయిన జోన్ 1o లో, దిగువ ౣఖీఖీ స్ట్రెచ్ వెంబడి బుద్వేల్ వద్ద, మధ్య జోన్ వద్ద గాంధీ సరోవర్ వద్ద, ఈ కారిడార్ తూర్పు చివరన బాపు ఘాట్ సమీపంలో కొత్త వంతెనలు ప్రతిపాదించారు. జోన్ 1ఏ లోని మూడు వంతెనలు అప్‌గ్రేడేషన్ కోసం నిర్ణయించారు. ఇందులో వెస్ట్ సైడ్ ఓఆర్ఆర్ వంతెన, ఉప్పర్‌పల్లి, కిస్మత్‌పూర్ వద్ద నిర్మాణాలు ఉన్నాయి. ఈ వంతెనలు వాహన, మల్టీమోడల్, పాదచారుల రాకపోకలను తీసుకెళ్లడానికి రూపొందించారు. డీపీఆర్ కారిడార్ అంతటా వర్తించే ఒకే ప్రామాణిక డిజైన్ కంటే వివిధ క్రాసింగ్‌లకు సరిపోయే వంతెన రకాల కలయికను వివరిస్తుంది. వంతెనల నుండి వేరుగా మూడు నీటి నిలుపుదల బ్యారేజీలను కూడా ప్రతిపాదించారు. ఈ బ్యారేజీలు ఏడాది పొడవునా నీటిని నిలుపుకునేలా రూపొందించారు. 'ఈ నది వెంట నీరు ఎల్లప్పుడూ ఉంటుంది. ఇది పర్యాటకాన్ని మెరుగుపరుస్తుంది, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తుంది, కార్యకలాపాలను మెరుగుపరుస్తుంది. ఈ ప్రత్యేక ప్రాంతంలోని ప్రతిదానినీ పెంచుతుంది.' అని నరసింహ రెడ్డి అన్నారు. ఈ బ్యారేజీలు వంతెన నెట్‌వర్క్ పక్కన పనిచేయడానికి ఉంచారు. ఒకటి కిస్మత్‌పూర్-బుద్వేల్ స్ట్రెచ్ వద్ద, మరొకటి జోన్ 1ఏ లోని బాపు ఘాట్ వంతెన దగ్గర ఉంటాయి. జోన్ 1బీలో ఇది మంచిరేవుల వంతెన దగ్గర ప్రతిపాదించారు. 21 కిలోమీటర్ల ఫేజ్ 1 స్ట్రెచ్ అన్ని భాగాలలో మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 6,500 కోట్ల నుండి రూ. 7,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా

# విజయ్‌కు కలిసి రాని కాలం

చెన్నై మార్చి 18,

తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన పార్టీ తమిళగ వెట్రి కళగం ద్వారా ఒక పెను సంచలనం సృష్టిస్తారని ఆశించిన అభిమానులకు, తాజా పరిణామాలు కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయాల్లోకి రాకముందే బలమైన సోషల్ మీడియా వింగ్‌ను సిద్ధం చేసుకున్న విజయ్, క్షేత్రస్థాయిలో వరుస తప్పిదాలతో ఆ మూమెంటంను కోల్పోతున్నారు. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో నిర్వహించిన ర్యాలీల్లో కరూర్ జిల్లాలో జరిగిన తొక్కిసలాట ఘటన విజయ్ రాజకీయ పరిపక్వతపై ప్రశ్నలు లేవనెత్తింది. సుమారు 41 మంది మరణించిన ఈ దుర్ఘటన తర్వాత, విజయ్ నేరుగా ప్రజల మధ్యకు వెళ్లడానికి భయపడుతున్నారనే ప్రచారం మొదలైంది.



భారీ జనసందోహాన్ని నియంత్రించడంలో విఫలమవ్వడం, కేవలం సోషల్ మీడియాకే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నీరసిస్తోంది. ఈ గ్యాప్‌ను భర్తీ చేసేందుకు అటు డీఎంకే, ఇటు ఏఐఏడీఎంకే వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. కరూర్ ఘటన తర్వాత మెల్లగా ప్రజల్లోకి వస్తున్న సమయంలో కుటుంబ సమస్యలు రోడ్డున పడ్డాయి. భార్య విడాకుల కోసం కోర్టుకెక్కడం, త్రిషతో వివాహేతర బంధం అనే ప్రచారంతో పాటు తండ్రి ఎస్.ఏ. చంద్రశేఖర్‌తో ఉన్న విభేదాలు కూడా హాట్ టాపిక్ గా మారాయి. ఒక నాయకుడిగా తన కుటుంబాన్నే ఏకతాటిపైకి తీసుకురాలేని వ్యక్తి, రాష్ట్రాన్ని ఎలా పాలిస్తారనే ప్రతిపక్షాల విమర్శలకు ఇది ఆస్కారం ఇస్తోంది. అన్నీ చక్కదిద్దుకుని ముందుకు వెళ్తామనుకుంటున్న దశలో, టీవీకే నేత ఆధవ్ అర్జున చేసిన వ్యాఖ్యలు సూపర్ స్టార్ రజనీకాంత్ అభిమానులను ఆగ్రహానికి గురిచేశాయి. రజనీకాంత్‌ను డీఎంకే బెదిరించిందని, అందుకే ఆయన వెనక్కి తగ్గారని ఆధవ్ అర్జున చేసిన ఆరోపణలు చివరకు రజనీ ప్రతిష్టను దెబ్బతీసేలా మారాయి. తమిళనాడులో రజనీకాంత్ అభిమానుల మద్దతు ఏ పార్టీకైనా చాలా ముఖ్యం. అలాంటిది అనవసరంగా వారిని శత్రువులుగా మార్చుకోవడం విజయ్ చేసిన అతిపెద్ద రాజకీయ తప్పిదంగా విశ్లేషకులు భావిస్తున్నారు. విజయ్ పార్టీ సోషల్ మీడియాలో ఎంత బలంగా కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణం ఇంకా బలపడలేదు. కేవలం స్టార్ పవర్ మీద ఆధారపడి, సీనియర్ రాజకీయ నేతలను ఎదుర్కోవడం అసాధ్యమని రాజకీయవర్గాలు ఓ క్లారిటీకీ వస్తున్నాయి.

========================

# రహస్య సమావేశాల కలకలం

హైదరాబాద్, మార్చి 18

అధికార పార్టీ ఎమ్మెల్యేల రహస్య సమావేశం. పైగా మంత్రి పదవి రాలేదన్న అసంతృప్తితో.. రగిలిపోతున్న ఓ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన సీక్రెట్ మీటింగ్. ఇప్పుడీ వార్త. తెలంగాణ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. మొత్తం 15 మంది ఎమ్మెల్యేలకు ఆహ్వానం. 9 మంది ఎమ్మెల్యేలు హాజరు. వచ్చిన వాళ్లతో సీక్రెట్ డిన్నర్ మీటింగ్. అవును..తెలంగాణ రాజకీయాల్లో ఇదే ఇప్పుడు పొలిటికల్ సెన్సేషనల్ టాపిక్. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహచర ఎమ్మెల్యేలతో రహస్య సమావేశం నిర్వహించారన్న టాక్ అధికార కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. మంత్రి పదవి రాలేదని తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న రాజగోపాల్ రెడ్డి..ఎమ్మెల్యేలతో సీక్రెట్ మీటింగ్ వెనుక ఆంతర్యం ఏమై ఉంటుందన్న ఉత్కంఠ నెలకొంది. చాలా కాలంగా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న రాజగోపాల్ రెడ్డి..అమాత్య యోగం దక్కకపోవడంతో ఎప్పటికప్పుడు తన అసంతృప్తిని వెళ్లగక్కుతూ వస్తున్నారు. మంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడల్లా తనకు క్యాబినెట్‌లో చోటు దక్కుతుందని భావించినా నిరాశే ఎదురవుతూ వస్తోంది. దీంతో తనకు మంత్రి పదవి రాకుండా సీఎం రేవంత్ రెడ్డే అడ్డు కాలు వేస్తున్నారని ఆగ్రహంగా ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. పబ్లిక్ డయాస్ అయినా..మీడియాతో ఆఫ్ ది రికార్డులో మాట్లాడినా బ్లాస్టింగ్ కామెంట్స్ చేస్తూ..చర్చకు, రచ్చకు తెరలేపుతున్నారాయన. మునుగోడు ప్రజల ఆశీర్వాదంతో త్వరలోనే తనకు మంత్రి పదవి వస్తుందని ఆశిస్తున్నట్లు ఈ మధ్యే చెప్పారు రాజగోపాల్ రెడ్డి. ఒకవేళ మంత్రి పదవి రాకపోతే డైరెక్టుగా సీఎం అవుతానంటూ వ్యాఖ్యనించారు. ఇచ్చిన మాట ప్రకారం తనకు మంత్రి పదవి ఇవ్వాలని పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. తాను ఇంకా వేచి చూస్తానని..పదవి కోసం తన బాధ కాదని అన్నారు. అభివృద్ధే తన లక్ష్యమని..తనను మంత్రిని చేయకపోతే సీఎం కావటమే తన టార్గెట్ అని కుండబద్దలు కొట్టి చెప్పారు. రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ కామెంట్స్ గత కొన్ని రోజులుగా రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. ఇలాంటి సిచ్యువేషన్‌లో ఇప్పుడు సీక్రెట్ డిన్నర్ మీటింగ్ అధికార కాంగ్రెస్‌లో కలకలం రేపుతుంది. నాలుగు రోజుల క్రితం రాజగోపాల్ రెడ్డి పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రహస్యంగా సమావేశం అయ్యారని తెలుస్తోంది. మొత్తం 15 మంది ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపగా 9 మంది ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి మీటింగ్‌కు హాజరైనట్లు చెబుతున్నారు. మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 9 మంది ఎమ్మెల్యేలతో ఆయన సీక్రెట్‌గా భేటీ అయినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో జరిపిన సీక్రెట్ డిన్నర్ మీటింగ్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏం మాట్లాడారన్నదే ఇంట్రెస్టింగ్‌గా మారింది. మంత్రి పదవి ఇవ్వకపోతే తానే ముఖ్యమంత్రి అవుతానన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు, 9 మంది ఎమ్మెల్యేలతో రహస్య సమావేశానికి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణంలో రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇది సాధారణ సమావేశమేనా లేదంటే కొత్త రాజకీయ సమీకరణాలకు కేంద్ర బిందువు కాబోతోందా అన్న సందేహాలకు తావిస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి పార్టీని వీడబోతున్నారన్న ప్రచారం జరుగుతున్న వేళ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రహస్య మీటింగ్ పెట్టడం ఆ పార్టీలో కాక రేపుతోంది. మంత్రి పదవి దక్కితేనే రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి చల్లారే పరిస్థితి ఉందంటున్నారు లీడర్లు. ఆయనకు అమాత్యయోగం కల్పిస్తే ప్లస్ ఎంత మైనస్ ఎంత బేరీజు వేసుకుంటున్నారట హస్తం పార్టీ పెద్దలు. ఇలాంటి నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డి సీక్రెట్ మీటింగ్ ఎజెండా ఏంటి..అందులో ఏయే అంశాలపై చర్చించారనేది ప్రస్తుతానికి అయితే ఉత్కంఠగా కొనసాగుతోంది. తేడా వస్తే ఎంతకైనా సిద్ధమని చెప్పేందుకే ఈ మీటింగ్ కోమటిరెడ్డి పెట్టారా అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. ఈ మీటింగ్ కు వెళ్లిన ఎమ్మెల్యేలెవరని అటు ఇంటెలిజెన్స్..ఇటు మిగతా ఎమ్మెల్యేలు ఆరా తీస్తున్నారట.

# రాత్రిపూట యాడ్లపై జరాభద్రం

హైదరాబాద్, మార్చి 18

అమాయక ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు రకరకాల పన్నాగాలు పన్నుతున్నారు. టెక్నాలజీ పెరిగిన కొద్దీ అప్‌గ్రేడ్ అవుతూ.. సరికొత్త పద్ధతుల్లో మోసాలు చేస్తున్నారు. ఇక పెళ్లి కాని యువకులు, మహిళల బలహీనత ఉన్న వారే టార్గెట్‌గా ప్రస్తుతం సైబర్ కేటుగేళ్లు కొత్త కొత్త మార్గాల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మహిళల పేరుతో వల వేసి.. దొరికిన కాడికి దోచుకుంటున్నారు. ఒంటరిగా ఉండే యువకులే లక్ష్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)సాయంతో మహిళలు మాట్లాడుతున్నట్లుగా వీడియోలు విడుదల చేసి.. పురుషులను బుట్టలో పడేసి డబ్బులు దండుకుంటున్నారు. ఇలాంటి మోసాల పట్ల హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలోనే గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న యాడ్ మోసాలపై సజ్జనార్ క్లారిటీ ఇచ్చారు. యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఊరించి.. అకౌంట్లు ఖాళీ చేస్తారని హెచ్చరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ ఎక్స్ వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఒంటరిగా ఉన్నారా? ఇంకెందుకు ఆలస్యం.. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అందమైన అమ్మాయిలు, ఆంటీలతో సరదాగా మాట్లాడండి. మీ రంగు, రూపంతో మాకు పనిలేదు." అంటూ సోషల్ మీడియాలో ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తున్న ఈ యాడ్స్ వెనుక ఉన్నది తీయటి మాటలు కాదు.. నిలువునా దోచేసే సైబర్ కేటుగాళ్ల ఉచ్చు. యువత ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు పన్నుతున్న హనీట్రాప్ ఇది. ఈ వీడియోల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మాయిలు నిజం కాదు. అవన్నీ ఏఐ సాయంతో సృష్టించిన వీడియోలు. మాయమాటలకు బుట్టలో పడి వారు సూచించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ముప్పు కొనితెచ్చుకున్నట్లే. ఆ లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే, మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ మొత్తం వారి అధీనంలోకి వెళ్లిపోతాయిఇక రాత్రిపూట సరదాగా మాట్లాడుదమని వీడియో కాల్ చేస్తే.. అవతలి వైపు న్యూడ్ వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మీ ముఖాన్ని రికార్డ్ చేస్తారు. ఆ తర్వాత దాన్ని మార్ఫింగ్ చేసి, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని బంధుమిత్రులకు పంపుతామంటూ బ్లాక్‌మెయిలింగ్ సెక్స్‌టార్షన్ కు దిగుతారు. పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత ఇచ్చుకుంటూ పోతే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయం. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఎవరూ మీకు ఊరికే స్నేహితులు కారు.. ఆ ఆకర్షణ వెనుక మీ డబ్బు, పరువు లాగేసే భారీ కుట్ర దాగి ఉందని గ్రహించాలి.

# ట్రాక్టర్ల యజమానుల కష్టాలు ఇంతింత కాదయా

ఖమ్మం, మార్చి 18, జీవనాధారం కోసం అప్పులు చేసి ట్రాక్టర్లు కొనుగోలు చేసిన అనేక మంది యజమానుల పరిస్థితి అశ్వాపురం మండలంలో రోజురోజుకు కష్టాల్లోకి జారుతోంది. కుటుంబాలకు ఆదాయం వస్తుందనే ఆశతో ఫైనాన్స్ కంపెనీల నుంచి అప్పులు తీసుకుని ట్రాక్టర్లు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు పనులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. చింతిర్యాల, గొల్లగూడెం, చింతిర్యాల కాలనీ, ఆనందపురం, సీతారామపురం పంచాయతీల పరిసర ప్రాంతాల్లోని ట్రాక్టర్లు గత కొన్ని నెలలుగా సరైన తోలకాలు లేక ఇండ్ల వద్దే నిలిచిపోయాయి. చేతిలో పని లేకపోవడంతో ఫైనాన్స్ కిస్తీలు చెల్లించడం యజమానులకు భారంగా మారింది. కొంతమంది ఎలాగోలా అప్పులు చేసి కిస్తీలు కడుతుండగా, మరికొందరు కుటుంబ పోషణ కూడా కష్టమై ట్రాక్టర్లను ఫైనాన్స్ సంస్థలకు అప్పగించాల్సిన పరిస్థితికి చేరుకుంటున్నారు. జీవనోపాధి కోసం కొనుగోలు చేసిన వాహనాలే ఇప్పుడు వారి భుజాలపై భారంగా మారుతున్నాయని ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొన్ని పంచాయతీలు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని కొందరు సాధారణ ట్రాక్టర్ యజమానులు గోదావరి నుంచి సహజంగా ఏర్పడిన ఇసుకను మండల ప్రజల అవసరాలకు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే వారు ఈ పని చేసేది కోట్లు సంపాదించేందుకు కాదు. కేవలం కుటుంబాలను పోషించుకునేందుకు మాత్రమే ఈ వృత్తిని కొనసాగిస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాక్టర్లు నడిపే వారి జీవన పరిస్థితులను పరిశీలిస్తే వారి ఆర్థిక స్థితి ఎంత కష్టాల్లో ఉందో స్పష్టమవుతుంది. గోదావరి నుంచి అరకొర ఇసుకను తోలుకుంటూ జీవనం సాగిస్తున్న కొందరికి కనీసం నివసించేందుకు సరైన ఇల్లు కూడా లేకపోవడం స్థానికులు చెబుతున్న వాస్తవం. సమాజంలో ఎవరికీ భారంగా కాకుండా స్వయంగా కష్టపడి జీవించాలనే ఉద్దేశంతోనే ఈ ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్ని శాఖల అధికారులు వారి పరిస్థితిని గమనించి సహకరించాలని భావించినప్పటికీ, సామాజిక మాధ్యమాలు మరియు సోషల్ మీడియా ప్రభావంతో ప్రతి చర్యపై విమర్శలు రావడంతో అధికారులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాక్టర్ యజమానుల జీవన స్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమగ్రంగా పరిస్థితిని పరిశీలించి వారికి ఉపశమనం కలిగించే చర్యలు తీసుకుంటే అనేక కుటుంబాలకు ఊరట లభించే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక ట్రాక్టర్ యజమాని వెన్న అశోక్ కుమార్ మాటల్లో.. పొట్ట నింపుకోవడానికే కొనుకున్న ట్రాక్టర్డ ఇప్పుడు అదే జీవన భారంగా మారింది. అశ్వాపురం మండలంలో చింతిర్యాల గోదావరి నది ఒడ్డు నుంచి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం ట్రాక్టర్ల ద్వారా ఇసుక సరఫరా జరుగుతోంది. కానీ మరికొన్ని పంచాయతీలలో గోదావరి ఒడ్డు నుంచి లారీల ద్వారా అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలింపులు జరుగుతున్నాయి.

# బీఆర్ఎస్ పాఠాలు నేర్చుకోదా?

హైదరాబాద్, మార్చి 18,

బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం అలసత్వంతో తనకు తాను చిక్కులు కొని తెచ్చుకుంటోంది. పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో అడ్డంగా దొరికినా మీన మేషాలు లెక్కపెడుతూ ఈరోజు షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఆ పార్టీ ప్రజల్లో పలుచనగా మారిందనే చెప్పాలి. మొయినా బాద్ ఫామ్ హౌస్ అనేది పైలట్ రోహిత్ రెడ్డిది. అక్కడ పోలీసులపై కాల్పులు జరపడమే కాకుండా డ్రగ్స్ వాడారని నిర్ధారణ అయింది. ఈ డ్రగ్స్ కేసులో ఆరోపణలను ఎదుర్కొంటున్న పుట్టా మహేశ్ కు తెలుగుదేశం పార్టీ వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కానీ బీఆర్ఎస్ నేడు నింపాదిగా నోటీసులు ఇవ్వడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న బీఆర్ఎస్ అగ్రనాయకత్వం వెంటనే చర్యలు తీసుకుని ఉంటే ఈ అపవాదును ఎదుర్కొనే అవకాశం ప్రత్యర్థులకు ఇచ్చి ఉండదు. పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ డ్రగ్స్ పార్టీ ఉదంతం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. మొయినాబాద్ ఫామ్ హౌస్ ఘటనలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పట్టుబడటం బీఆర్ఎస్ పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. ఈ వ్యవహారంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఇది రాజకీయ కుట్ర అని అభివర్ణించడం సొంత పార్టీలోనే చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు పార్టీలు తమ ప్రతిష్టను కాపాడుకోవడానికి నిందితులను దూరం పెడతాయి. కానీ, రోహిత్ రెడ్డి విషయంలో బీఆర్ఎస్ చూపుతున్న సాఫ్ట్ కార్నర్ వెనుక ఉన్న అసలు కారణాలేమిటన్నది ఇప్పుడు రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అసలే కవితతో రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ పార్టీ ఇటువంటి విషయాల్లో ఏమాత్రం వేచి చూసి ఉండకూడదు. ఈ పరిణామాలను కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మార్చుకుంది. రోహిత్ రెడ్డికి, బీఆర్ఎస్ అగ్రనేతలకు మధ్య ఉన్న అంతర్గత సంబంధాల వల్లే పార్టీ ఆయనను వెనకేసుకొస్తోందని కాంగ్రెస్ బలంగా ప్రచారం చేస్తోంది. చివరకు ఏడురోజుల సమయం ఇచ్చి షోకాజ్ నోటీసు ఇచ్చినప్పటికీ అది కంటితుడుపు చర్యేనంటూ కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేస్తుండటం బీఆర్ఎస్ ను మరింత ట్రబుల్ లోకి నెట్టినట్లయింది.

===========

# కూటమి ప్రభుత్వం మీ సంక్షేమానికి మరింత అండగా నిలుస్తుంది”

# దివ్యాంగుల సంక్షేమానికి “దివ్యాంగ శక్తి” పథకం

## దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



దెందులూరుపెదవేగి మండలం దుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయం వద్ద దివ్యాంగశక్తి పథకాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించారు..

దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అందిస్తూ ఏర్పాటు చేసిన తొలి బస్సు కు జెండా ఊపి ప్రారంభించారు..

శనివారం నుంచి దివ్యాంగుల కొరకు దెందులూరు లో ప్రత్యేక నియోజకవర్గస్థాయి సదరం శిబిరం నిర్వహించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సుపరిపాలన అందిస్తుందని, వాటిలో భాగంగానే దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ ఈరోజు దివ్యాంగ శక్తి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి చేతులమీదుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందని దీనిద్వారా దివ్యాంగుల సంక్షేమానికి , వారిలో ఆత్మ స్థైర్యాన్ని మరింత పెంపొందించడానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో దోహద పడిందని దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు తెలిపారు.. పెదవేగి మండలం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఉదయం దివ్యాంగ శక్తి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు దివ్యాంగుల కోసం ఉచిత ప్రయాణాన్ని ఏర్పాటు చేస్తూ కేటాయించిన తొలి బస్సు కు జెండా ఊపి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులతో మాట్లాడుతూ వారితో మమేకమైన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వ్యక్తికి ఏదైనా లోపం ఉన్నప్పుడు అందుకు రెట్టింపు నైపుణ్యాన్ని భగవంతుడు ప్రసాదిస్తాడని, తమలో దాగివున్న అటువంటి నైపుణ్యాన్ని గుర్తించి దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల సామాజిక ఆర్థిక సమగ్ర అభివృద్ధి సంక్షేమలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు తెలియజేశారు. ఈనాడు రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రారంభించిన దివ్యాంగ శక్తి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది దివ్యాంగులు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నారని, వారితోపాటు వారి సహాయకులకు సైతం పరసి మొత్తం రాష్ట్రంలో 12.76 లక్షల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర ఉందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా రూ.207 కోట్ల రూపాయలతో భారీ సబ్సిడీని అందించడం జరుగుతుందని, ప్రభుత్వ ఏపీఎస్ఆర్టీసీకి చెందిన సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సుల్లో ఈరోజు నుంచి దివ్యాంగులకు ఉచిత ప్రయాణం అమలు చేయడం జరుగుతుందని, బస్సు ఎక్కిన తరువాత తమ గుర్తింపు కార్డును చూపి జీరో టికెట్ను పొందవచ్చని తెలిపారు.

# రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

# అన్నదాత సుఖీభవ ఇంటింటా ప్రచారంలో

# టీడీపీ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి

కౌతాళం మార్చి 18,

రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని రైతుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రతి రైతుకు సంక్షేమ పథకాలు ప్రయోజనం చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి చేస్తుందని మంత్రాలయం



నియోజకవర్గం టీడీపీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి సింగిల్ విండో చైర్మన్ వెంకటపతిరాజు,బోయ మారెప్ప టిబిపి చైర్మన్ టిప్పుసుల్తాన్,అడివప్ప గౌడ్,పట్టాభి,మరియు మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు,రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం నందు పీఎం సీఎం కిసాన్ విడత అన్నదాత సుఖీభవ పథకం ఇంటింటా ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు పాల్గొని లబ్ధి దారులకు సంక్షేమ అభివృద్ధి ఫలాల, పెట్టుబడి సహాయం కింద ఏడాదికి 20 వేలు కేంద్రం నుండి 6 వేలు,రాష్ట్ర ప్రభుత్వం నుండి 14 వేలు మూడు విడతలో రైతన్నలకు అందించిందని వివరిస్తూ,సమస్యలను పరిష్కరించే విధంగా పాలన అందిస్తామని,ప్రతి హామీని ప్రజలకు చేరవేసన్తూ,ప్రజలను చైతన్యం చేసే దిశగా అడుగులు వేస్తుందని,ప్రకృతి వ్యవసాయ సేద్యం వైపు ప్రతి రైతు కొనసాగి భూసార పరిరక్షణకు కాపాడి,అధిక దిగుబడి వచ్చే విధంగా లాభసాటి వ్యవసాయం చెయ్యాలని ప్రజలను కోరుతూ,అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం నదుల అనుసంధానం ద్వారా ప్రతి రైతు కు ఎకరాకు తాగు సాగు నీరు అందించే విధంగా మన ముఖ్యమంత్రి ప్రణాళికలు సిద్ధం చేశారని దీనికి ప్రజల సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమములో సాద్రిబసవరాజు,రామలింగ,కురువ వీరేష్, గుండప్ప,జనసేన రామాంజినేయులు, బిజెపి చిన్న,రమేష్,పట్టణ అధ్యక్షులు డా''రాజానందు, ముకన్న,గిరి,నరసన్న, ఈరణ్ణ,సన్నప్ప,మహాదేవ,లక్కే గోవిందు, మాధవరెడి ్డ,బసవరాజు,పాల్గొన్నారు.

# ‘దివ్యాంగ శక్తి’ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

నంద్యాల మార్చి 18

దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో, సమాన అవకాశాలతో జీవించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఇంద్రధనుస్సు’ కార్యక్రమంలో భాగంగా ‘దివ్యాంగ శక్తి’ (ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం) పథకాన్ని స్థానిక నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి ఫరూక్ దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు 100% ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా వారిపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, వారు స్వేచ్ఛగా తిరిగేలా ప్రభుత్వం భరోసా ఇస్తోందని తెలిపారు . ఈ పథకం ద్వారా దివ్యాంగులు విద్య, ఉపాధి, మరియు ఆరోగ్య అవసరాల కోసం ఎక్కడికైనా సులభంగా వెళ్లవచ్చు అని . ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అన్నారు . ఏ ఒక్క పౌరుడు వివక్షకు గురికాకూడదనే లక్ష్యంతో, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్న ముఖ్యమంత్రి గారి సంకల్పానికి ఈ కార్యక్రమమే నిదర్శనం అన్నారు. అనంతరం మంత్రి ఫరూక్ లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి, పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. 10వ తరగతి పరీక్షల దృష్ట్యా



విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ అంతరాయం లేని మార్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , రజియా సుల్తానా, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య స్థానిక క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో దివ్యాంగ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో భర్త అరెస్టు

కోరుట్ల మార్చి 18

పట్టణానికి చెందిన యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో నిందితుడైన భర్తను కోరుట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రెస్మీట్లో మెట్పల్లి డిఎస్పి రాములు మాట్లాడుతూమాధాపూర్ గ్రామానికి చెందిన గంధం దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన కుమార్తె చిత్తారి ఏ గంధం వైష్ణవి (20)ను ఆమె భర్త చిత్తారి హరిబాబు హత్య చేసినట్లు ఫిర్యాదు అందినట్టు తెలిపారు. టీఎస్పీ రాములు తెలిపిన వివరాల ప్రకారం వైష్ణవి యూట్యూబ్ ద్వారా వీడియోలు రూపొందిస్తూ ఉండేది. సుమారు 10 నెలల క్రితం హరిబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి వివాహం కోసం వచ్చాడు. కట్నం ఇవ్వలేమని స్పష్టంగా తెలిపినా, ఇద్దరి మధ్య పరిచయం పెరిగి ప్రేమ వివాహానికి దారితీసింది. అయితే హరిబాబు తల్లి లక్ష్మి కట్నం లేకుండా వివాహానికి అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే కుటుంబ సభ్యుల మీద ఒత్తిడి తెచ్చేందుకు హరిబాబు విషం సేవించి ఆత్మహత్యాయత్నం చేసినట్లు పేర్కొన్నారు. చికిత్స అనంతరం కోలుకున్న అతడు మళ్లీ వివాహం కోసం ఒత్తిడి చేయగా, మొదట కుటుంబం నిరాకరించింది. ఈ క్రమంలో 29-05-2025 రోజున వెంకటాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వివాహం వైష్ణవి హరిబాబు జరిగింది. అనంతరం వారు ఫిర్యాదుదారుడైన గంధం దుర్గ ప్రసాద్ ఇంటిలోనే వారు నివసించారు. కొంతకాలం తర్వాత హరిబాబు రూ.5 లక్షల కట్నం కోరగా, ఆ మొత్తాన్ని ఇచ్చి మాధాపూర్ గ్రామంలో రెండు గుంటల భూమి కొనుగోలు చేసి ఫిర్యాదుదారు ఇచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ మరో రూ.5 లక్షలు కోరుతూ వైష్ణవిని మానసిక, శారీరకంగా వేధించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అతని తల్లి లక్ష్మి, అన్నలు ఆనంద్, అశోక్ కూడా ప్రేరేపించినట్లు ఆరోపించారు. సుమారు మూడు నెలల క్రితం వైష్ణవి గర్భవతిగా ఉన్ననాటి నుండి ఎక్కువగా వేధింపులు కొనసాగినట్లు వెల్లడించారు. మార్చి 16 రాత్రి 11 గంటల సమయంలో వైష్ణవి, హరిబాబు గదిలో నిద్రకు వెళ్లగా, తెల్లవారుజామున 4 గంటల సమయంలో శబ్దాలు వినిపించాయని, తలుపు తట్టినా తీయకపోవడంతో తిరిగి వెళ్లిపోయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం హరిబాబు తన భార్యను నిద్రలో ఉండగానే కత్తితో దాడి చేసి, గొంతు నులిమి హత్య చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మార్చి 17 ఉదయం 6 గంటల సమయంలో హరిబాబు ఒంటరిగా బయటకు వచ్చి, ముఖం కడిగి తన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ పై ఎవరికి తెలియకుండా వెళ్లిపోయాడు. తర్వాత గది తలుపు తెరిచి చూడగా వైష్ణవి రక్తపు మడుగులో పడివుండగా, నుదిటిపై గాయాలు, మెడపై గుర్తులు కనిపించాయి. వెంటనే ఆమెను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, కోరుట్లకు తరలించగా, వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ప్రకటించారు. హత్య అనంతరం హరిబాబు రాయికల్?మైతాపూర్ ప్రాంతాల్లో తిరుగుతూ, కొనరావుపేట ఎక్స్ రోడ్ సమీపంలోని ఖాళీ డబుల్ బెడ్‌రూమ్ ఇంటి మెట్ల కింద కత్తి, రక్తపు మచ్చలున్న దుస్తులను దాచిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అదే రోజు సాయంత్రం 6:30 గంటలకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి ఒప్పంద ప్రకటన ఆధారంగా పంచుల సమక్షంలో రికవరీ పంచనామా నిర్వహించి, బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్, రక్తపు మచ్చలున్న కత్తి, నీలం రంగు జీన్స్ ప్యాంట్, నీలం రంగు టీ-షర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌డీపీఓ మెట్పల్లి ఏ. రాములు, కోరుట్ల సిఐ బి సురేష్ బాబు, ఎస్సై చిరంజీవి తెలిపారు.

# మట్టి పాత్రలను వాడండి

## – ఆరోగ్యాన్ని కాపాడుకోండి .ఉగాది పండుగను మట్టి పాత్రలతో జరుపుకుని కుల వృత్తిని ప్రోత్సహించండి

హైదరాబాద్ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని పురస్కరించుకొని “మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి ,కుల వృత్తులను ప్రోత్సహించండి” నినాదంతో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కి ఉగాది మట్టి పాత్రల కిట్ ను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడడానికి ,కుల వృత్తులను కాపాడడానికి ఆరోగ్యాలను కాపాడుకోవడానికి మట్టి పాత్రలు మంచివని తెలిపారు. అందజేశారు. మట్టి పాత్రలు వాడకం తరతరాల సంప్రదాయమని , దీని వల్ల ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని, ఉగాది పండుగ సందర్భంగా మట్టి పాత్రలు వాడండి కుల వృత్తులను కాపాడండి .. ఆరోగ్యాన్ని రక్షించుకోండి అని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

# జిల్లా ప్రజలకు యుగాది, (ఉగాది) శుభాకాంక్షలు తెలిపిన జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 18: జిల్లా ప్రజలందరికీ యుగాది పర్వదినం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు జిల్లా పాలనాధికారి శ్రీ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.

యుగాది తెలుగు నూతన సంవత్సరానికి ఆరంభ సూచికగా నిలిచే పర్వదినమని, ఇది మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విశిష్టమైన వేడుక అని ఆయన తెలిపారు. ఈ శుభ సందర్భంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో, ఆరోగ్యంతో నిండిపోవాలని ఆకాంక్షించారు.

ప్రజలందరూ పరస్పర స్నేహభావంతో, ఐకమత్యంతో జీవిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ యుగాది పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, అవకాశాలు, విజయాలను తీసుకురావాలని జిల్లా పాలనాధికారి ఆకాంక్షించారు.

# పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు



పరాభవం ఎరుగని ప్రగతి కావాలి ఈ ఉగాది
అహంకారం దరిచేరని వినతి కావాలి ఈ ఉగాది
అవమానం లేని ఆత్మీయత కావాలి ఈ ఉగాది
పరాభవ నామ సంవత్సరంలో.. పునర్జన్మ పొందాలి ప్రతి ఆశీస్సుల ఈ ఉగాది!
?గత అపజయాల చీకట్లు వీడి
నవ విజయాల బాటలో అడుగులు వేద్దాం..
విద్వేషాల నీడలు విడిచి
స్నేహ సౌరభాలతో అందరం కలిసి సాగుదాం..
?ఈ 'పరాభవ' నామ సంవత్సరంలో..
అపజయాలు లేని విజయాలు మనవవ్వాలని,
అందరి జీవితాల్లో సుఖశాంతులు నిండాలని ఆశిస్తూ..
అందరికీ ఉగాది శుభాకాంక్షలు!

– చుంచు రమేష్
జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త

# నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించిన ప్రభుత్వం

-ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భద్రత అంశాలపై అవగాహన
-అక్రమ రవాణా, అసాంఘిక చర్యల పై పటిష్ట నిఘా
-ప్రజల భద్రత కోసమే నిత్యం తనిఖీ
-సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా



సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 18:




ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయం నందు అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి తో కలిసి జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ పోలీసు అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సామాజిక రక్షణ, శాంతి భద్రతల అంశాలు, చట్టాల అమలు, సామాజిక భద్రతలో పౌరుల బాధ్యత, రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నివారణ, మహిళల భద్రత, యువత భద్రత అంశాల పట్ల విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల పై పటిష్ట నిఘా ఉంచి నివారించాలని ఆదేశించారు.సమీక్ష లో భాగంగా నేరాల నమోదు, పెండింగ్ కేసులు, కోర్టు మానిటరింగ్, శిక్షలు అమలు, డయల్ 100 కాల్స్, బాధితుల ఇంటి వద్ద నుండి కేసు నమోదు, ప్రజా ఫిర్యాదుల పై స్పందన, వాహనాల తనిఖీ, అనుమానిత వ్యక్తుల కదలికలు, రౌడి షిటర్స్ పై నిఘా, రోడ్డు ప్రమాదాల నిర్మూలన, సైబర్ మోసాల్లో నగదు రిఫండ్, దొంగతనాల కేసుల్లో కేసుల డిటెక్షన్ మొదలగు అంశాలను సమీక్షించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. సైబర్ మోసాలపై, మహిళా భద్రతపై అవగాహన కల్పించాలి అన్నారు. కేసులు పెండింగ్ లేకుండా దర్యాప్తు చేయాలి, వేగంగా పోలీసు సేవలు అందించాలి, ప్రజలకు అందుబాటులో ఉండాలి అన్నారు. పాత నెరస్తులపై నిఘా ఉంచాలి అన్నారు.రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, అక్రమ రవాణా నివారణకు నిత్యం తనిఖీలు చేయాలి అని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట డి.ఎస్.పి ప్రసన్నకుమార్, డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ మాగ్దూమ్ అలి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సిఐలు, ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి ప్రస్తుత సమాజంలో మహిళలదే కీలకపాత్ర: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి18(భారత శక్తి) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో మహిళల పాత్రను కొనియాడుతూ, వారికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, నేటి సమాజంలో మహిళలు అబలలు కాదని, సబలులుగా అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. విద్య ద్వారా మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, ప్రతి మహిళ తన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమని పేర్కొన్న కలెక్టర్, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల అభివృద్ధికి పురుషుల సహకారం కూడా అవసరమని, సమాన అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

మహిళలు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, విజయవంతమైన మహిళలు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు.

జిల్లా యంత్రాంగం తరఫున మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని, పని ప్రదేశాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్న విద్యార్థులు, ఉద్యోగులు తమ విజయగాథలను ఈ సందర్భంగా పంచుకున్నారు.

ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఖజానా శాఖ అధికారి సరోజ, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు మంత్రి జూపల్లి ఉగాది శుభాకాంక్షలు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 18(భారత శక్తి)



ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'శ్రీ పరాభవ' నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది మన వారసత్వపు పండుగ అని అభివర్ణించారు. పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కళలు, జాతిని సజీవంగా నిలుపుతాయని తెలిపారు.

వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలి అని మంత్రి ఆకాంక్షించారు. సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని అభిలాషించారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల్లో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పండగ అన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. రైతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధితో అనుబంధ రంగాలు, వృత్తులు బలపడి రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. జీవితం కష్టసుఖాల సమ్మేళనం, ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో తెలంగాణతో పాటు, దేశం మరింత అభివృద్ధి సాధించాలి అని ఆకాంక్షించారు.

# సూర్యాపేట లో మొదటిసారిగా క్యాన్సర్ కి శస్త్రచికిత్స

భారత శక్తి సూర్యాపేట బ్యూరో, మార్చి 18:



సూర్యాపేట జిల్లాలో మొదటిసారిగా క్యాన్సర్ కు అరుదైన వైద్యం మా అమ్మ హాస్పిటల్ లో నిర్వహించారు.నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన మహిళ గత కొంత కాలంగా కడుపునొప్పి తో బాధ పడుతోంది. సూర్యాపేట లో మన అమ్మ హాస్పిటల్ లో సంప్రదించగా, డాక్టర్"నాగార్జున జనరల్ లాప్రోస్కోపిక్ సర్జన్ స్కాన్ చేసి అపెండిక్స్ దగ్గర క్యాన్సర్ కణితి తయారయ్యిందని గుర్తించారు. డాక్టర్ "దాములూరి రాము (క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణులు)ఆధ్వర్యంలో 5 గంటలు శస్త్రచికిత్స నిర్వహించి కణితిని,అది వ్యాపించిన పేగు అంచులని తొలగించి మళ్లీ ఇలయసయాకల్ అనాస్తోమోసిస్ సర్జరీ చేసి విజయవంతంగా క్యాన్సర్ కణితిని మొత్తం తొలగించారు.డాక్టర్ నాగార్జున డాక్టర్ నాగ డాలియా వెన్న, డాక్టర్ ఇందిరా ,డాక్టర్ సుధీర్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవాడ లో 'సురక్షా సంకల్ప కార్యశాల'

## -జిల్లాల వారీగా హెచ్ఐవీపై పోరాటం




విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మార్చి 18:

హెచ్ఐవి నియంత్రణలో పురోగతిని వేగవంతం చేసే జాతీయ స్థాయి ప్రయత్నాల్లో భాగంగా, 18 మార్చి 2026న ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో రాష్ట్ర స్థాయి 'సురక్షా సంకల్ప కార్యశాల' నిర్వహించారు. భారత ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (చీూజూ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వర్క్‌షాప్‌కు ఎన్ఏసీఓ (చీూజూ) డైరెక్టర్ జనరల్ మరియు భారత ప్రభుత్వం, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ. అదనపు కార్యదర్శి, డాక్టర్ రాకేశ్ గుప్త అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ూూూజూ) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కే. నీలకంఠ రెడ్డితో పాటు ఎన్ఏసీఓ, రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఈ కార్యశాల 'మిషన్ ఎయిడ్స్ సురక్ష' కింద ప్రాధాన్యత కలిగిన రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న వరుస సమీక్షలు, వ్యూహాత్మక సమావేశాలలో ఒక భాగం. జిల్లా స్థాయిలో హెచ్ఐవి (ని×ఎ) నియంత్రణ చర్యలను బలోపేతం చేసేందుకు భారత ప్రభుత్వం తీసుకుంటున్న వేగవంతమైన, లక్ష్యిత విధానానికి ఇది నిదర్శనం. ఒకదాని తర్వాత ఒకటిగా పలు రాష్ట్రాలను సమీక్షిస్తూ, హెచ్ఐవి వ్యాప్తి ఎక్కువగా ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. ఎక్కడైతే కార్యక్రమాలను బలోపేతం చేయడం ద్వారా స్పష్టమైన మార్పు తీసుకురావచ్చో, అటువంటి జిల్లాల్లో చర్యలను మరింత వేగవంతం చేయాలని ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం వయోజనుల హెచ్ఐవీ (ని×ఎ) వ్యాప్తి 0.58 శాతంగా ఉంది. సుమారు 3,10,451 మంది హెచ్ఐవీతో జీవిస్తున్నట్లు అంచనా, అందుకే జాతీయ స్థాయి హెచ్ఐవీ నియంత్రణ చర్యల్లో ఏపీకి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇటీవలి గణాంకాల ప్రకారం, జాతీయ హెచ్ఐవీ కార్యక్రమం కింద గుర్తించిన 'ప్రాధాన్య జిల్లాల' జాబితాలో ఆంధ్రప్రదేశ్ ను ప్రాధ్యాన్య రాష్ట్రంగా గుర్తించారు. రాష్ట్రంలోని అనకాపల్లి, అనంతపురం, అన్నమయ్య, బాపట్ల, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కృష్ణా, కర్నూలు, నంద్యాల, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, శ్రీకాకుళం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి మరియు వైఎస్ఆర్ కడప ఇలా మొత్తం 23 జిల్లాలను ప్రత్యేక దృష్టి సారించాల్సిన ప్రాంతాలుగా గుర్తించారు. రాష్ట్రంలోని మొత్తం హెచ్ఐవీ కేసుల్లో ఈ జిల్లాల వాటానే ఎక్కువగా ఉన్నందున, ఇక్కడ డేటా ఆధారితంగా నిరంతర పర్యవేక్షణ, పటిష్టమైన చర్యలు అవసరమని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ కార్యశాలలో జిల్లా స్థాయి పరిస్థితులపై సమగ్ర సమీక్షలు నిర్వహించారు. ప్రధానంగా వ్యాధి వ్యాప్తి ధోరణులను విశ్లేషించడం, పరీక్షల పరిధిని పెంచడం, చికిత్స ప్రారంభించడం, దానిని కొనసాగించేలా చూడటం, వైరల్ లోడ్ నియంత్రణ వంటి అంశాలపై చర్చించారు. వీటితో పాటు, అత్యంత ప్రమాదంలో ఉన్న మరియు వ్యాధి బారిన పడే అవకాశం ఉన్న వర్గాల కోసం చేపడుతున్న అవగాహన కార్యక్రమాల గురించి క్షుణ్ణంగా సమీక్షించారు.

సమావేశంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి డాక్టర్ రాకేశ్ గుప్త మాట్లాడుతూ జాతీయ హెచ్ఐవీ నియంత్రణ చర్యల్లో స్థానిక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడం, సూక్ష్మ స్థాయి ప్రణాళిక ఎంత ముఖ్యమో వివరించారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఎయిడ్స్‌ను పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవాలంటే క్షేత్రస్థాయి ఆధారాలతో కూడిన ప్రణాళికలు, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ మరియు సంబంధిత విభాగాల మధ్య సమన్వయం అవసరమని అన్నారు.

ఈ కార్యశాలలో పలు జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు (ణవీనూం), మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు పాల్గొన్నారు. వారు తమ జిల్లాల్లో సాధించిన పురోగతిని వివరించడంతో పాటు, ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయో విశ్లేషించారు. హెచ్ఐవీ నియంత్రణను మరింత ఉధృతం చేసేందుకు ఆయా జిల్లాల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు.

ముఖ్యంగా వ్యాధి బారిన పడే అవకాశం ఉన్న వర్గాలపై దృష్టి సారించడం, హెచ్ఐవీ పరీక్షల పరిధిని విస్తరించి వ్యాధిని త్వరగా గుర్తించడం, యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ూ=) చికిత్సను అందరికీ సకాలంలో అందించి, వారు దానిని కొనసాగించేలా చూడటం, హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో వైరస్ ప్రభావాన్ని తగ్గించడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చలు జరిగాయి.

విజయవాడలో జరిగిన ఈ సురక్షా సంకల్ప కార్యశాల ద్వారా జాతీయ స్థాయి '95-95-99' లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి జిల్లాకు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ రూపొందుతుందని భావిస్తున్నారు. అంటే, హెచ్ఐవితో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ పరిస్థితి గురించి తెలిసి ఉండాలి, వ్యాధి నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి నిరంతర చికిత్స అందాలి, చికిత్స పొందుతున్న వారిలో 99 శాతం మందిలో వైరస్ ప్రభావం అదుపులోకి రావాలి. ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఎయిడ్స్‌ను అంతం చేసే దిశగా భారతదేశం పెట్టుకున్న సమయ పరిమితితో కూడిన లక్ష్యాలను చేరుకోవడానికి ఈ ప్రయత్నాలు ఎంతగానో దోహదపడతాయి.

ఇలాంటి వరుస సమీక్షలు, రాష్ట్ర స్థాయి కార్యక్రమాల ద్వారా, హెచ్ఐవి నియంత్రణలో డేటా ఆధారితమైన, పటిష్టమైన విధానాన్ని 'ఎన్ఏసీఓ' (చీూజూ) బలోపేతం చేస్తోంది. జాతీయ లక్ష్యాల సాధనలో భాగంగా, ప్రాధాన్యత కలిగిన రాష్ట్రాల్లో జిల్లా స్థాయి అమలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటోంది.

# రేగొండ నూతన ఎస్సైని సన్మానించిన బీఆర్ఎస్ యూత్ నాయకులు



రేగొండ,మార్చి 18 (భారత శక్తి): బిఆర్ఎస్ అధ్యక్షులు మాదగాని నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన ఎస్సై డి. సుధాకర్ ను బీఆర్ఎస్ యూత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై సుధాకర్ కు పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్సై డి. సుధాకర్ యువతతో కాసేపు ముచ్చటించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు యువత పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో పసుల రాజు,, తడుక శ్రీకాంత్,కొడెపాక అర్జున్, కందకట్ల రాజు, పొడేటి శివ, పూజారి నాగరాజు, గండి నరేష్, ఓరంగటి నితీష్, ఎడ్ల గణేష్,మాడగాని విజయ్, మాడగాని శివ, మాడగాని ప్రశాంత్, తడుక ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి: జిల్లా కలెక్టర్





ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 18 (భారత శక్తి) : ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపురం గ్రామం లో భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రీ సర్వేకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.

గురువారం రామచంద్రాపూర్ గ్రామంలోని రైతు వేదికలో రామచంద్రపురం గ్రామంలోని 10 వేల5వందల ఎకరాల వ్యవసాయ భూమికి రీ సర్వే, హద్దులు గుర్తించుటకు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. గ్రామ ప్రజలతో గ్రామ సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రామచంద్రపూర్ భూములను రీ సర్వే నిర్వహించి భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు.

గతంలో అనేక కారణాలవల్ల చాలామంది రైతులకు పట్టా పాస్ బుక్ లు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారని వాటన్నిటికీ శాశ్వత పరిష్కారం చూపించే విధంగా 10 వేల 5 వందల ఎకరాల వ్యవసాయ భూమిని 9 బ్లాక్ లుగా 9 సర్వే బృందాలను ఏర్పాటు చేసి ఒక రోజు 50 నుంచి 75 మంది పట్టాదారుల భూములను రి సర్వే చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని సూచించారు. రీ సర్వే నిర్వహించడానికి గ్రామస్తులు రైతులు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి, ఆర్డీవో వెంకటేష్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, రామచంద్రపూర్, దేవ నగర్, భూపాల్ నగర్, గుర్తుర్ తండా, శివతండా సర్పంచులు దొంతి స్వరూప, సంతోష్, రమణారెడ్డి, రాజు నాయక్, భాస్కర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఉగాది పురస్కారాన్ని అందుకున్న నీరుడు మహేష్ ముదిరాజ్

### -జాతీయ పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉంది

### -ఎన్ ఎం ఎం యువసేన చైర్మన్ నీరుడు మహేష్ ముదిరాజ్

జిన్నారం మున్సిపల్, (భారత శక్తి ) మార్చ్ 18:



హైదరాబాద్ రవీంద్రభారతిలో మయూరి ఆర్ట్స్ అధినేత రాధా, దత్తు నేతృత్వంలో వివిధ రంగాలలో సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువతీ యువకులకు జాతీయ ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దువ్వాడ శ్రీను, దువ్వాడ మధుశ్రీ, విశిష్ట గౌరవాధ్యక్షులుగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ బింగి నరేందర్ గౌడ్, అతిథులుగా డైరెక్టర్ ముని కోటి, దొర సాయి తేజ చేతుల మీదుగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ రాళ్లకత్వ గ్రామానికి చెందిన ఎన్ఎంఎం యువసేన వ్యవస్థాపక చైర్మన్ నీరుడి మహేష్ ముదిరాజ్ చేపట్టిన సామాజిక ఆర్థికపరమైనటువంటి,సాంస్కృతికపరమైనటువంటి పలు సేవా కార్యక్రమాలను గుర్తించి మయూరి ఆధ్వర్యంలో జాతీయ ఉగాది పురస్కారాన్ని అందించడం జరిగింది.

అనంతరం జాతీయ ఉగాది పురస్కారాన్ని అందుకున్న ఎన్ ఎం ఎం యువసేన చైర్మన్ నీరుడు మహేష్ యాదవ్ మాట్లాడుతూ చిన్న తనం నుండి నేను సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు ప్రారంభించి సమాజ శ్రేయస్సు కోసం తలపెడుతున్న కార్యక్రమాలు గుర్తించి నాకు మయూరి ఆర్ట్స్ ద్వారా జాతీయ ఉగాది పురస్కారం రావడం ఆనందంగా ఉందని అన్నారు. నాకు ఈ అవార్డు అందించిన మయూరి ఆర్ట్స్ అధినేతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, నేను సమాజంలో మరింత సేవా కార్యక్రమం చేయుటకు నాపైన మరింత బాధ్యత పెరిగిందని సంతోషిస్తున్నాను. నేను చేసే సేవా కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్న తల్లిదండ్రులకు మా అన్న తమ్ములకి నా భార్యకు, మా కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, నేను తలపెట్టే సామాజిక కార్యక్రమాలను పత్రికల్లో ప్రచూరిన చేస్తున్న పాత్రికేయులకు కూడా అభివందనం తెలియజేస్తున్నా అన్నారు.

# మంగళం డిపోలో 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభం

## ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - ట్రాఫిక్ ఇన్స్పెక్టర్. స్టార్ కృష్ణ.

తిరుపతి మార్చి 18. బుధవారం మంగళం లో తిరుపతి ఆర్డీఓ రామ మోహన్, మంగళం డిపో మేనేజర్ సుధాకర్ చేతులమీదుగా ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దివ్యాంగ శక్తి స్కీమ్ ను ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామ మోహన్ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం విజయవంతం అయిన తర్వాత దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణం అందించాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన నుండి పుట్టిన మరో ఉపయోగకరమైన పథకం దివ్యాంగ శక్తి పథకం అని తెలిపారు. మంగళం డిపో మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ దివ్యాంగ శక్తి స్కీమ్ ను నలభై శాతం అంగవైకల్యం ఉన్న వారందరూ పల్లెవెలుగు, సిటీ,ఆర్డినరీ, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ తదితర సర్వీసులలో దివ్యాంగులు ప్రయాణించవచ్చుని, నూరు శాతం వైకల్యం ఉన్నవారికి మరియు అరవై తొమ్మిది శాతం కంటే తక్కువ ఐక్యూ ఉన్న దివ్యాంగులకు సహాయంగా వచ్చేవారికి యాభై శాతం రాయితీతో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు డి.ఎం.గారు తెలియజేశారు. దివ్యాంగులందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పద్మావతి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ స్టార్ కృష్ణ, కండక్టర్ రేఖ, డ్రైవర్ జి.ఆర్.చంద్ర, అన్ని అసోసియేషన్ల నాయకులు, కూటమి ప్రభుత్వ నాయకులు మరియు దివ్యాంగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నా అనుమతి లేకుండానే ఆ పని చేశారు.. వివాదాస్పద పాటపై నోరా ఫతేహి క్లారిటీ

బాలీవుడ్ నటి, డ్యాన్సర్ నోరా ఫతేహి... 'కేడీ: ది డెవిల్' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాటపై చెలరేగిన వివాదంపై ఎట్టకేలకు స్పందించారు. ఈ పాట హిందీ వెర్షన్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, దాని నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ఓ వీడియో సందేశం ద్వారా స్పష్టం చేశారు. ఈ పాటను తన అనుమతి లేకుండానే హిందీలో డబ్ చేసి విడుదల చేశారని ఆమె ఆరోపించారు. ఈ పాటను తాను మూడేళ్ల క్రితం కన్నడలో షూట్ చేశానని, దానిని తర్వాత ఎలా మారుస్తారో తనకు తెలియదని నోరా తెలిపారు. "ఇది ఒక పెద్ద సినిమా కావడం, సంజయ్ దత్ లాంటి స్టార్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌కు ఒప్పుకున్నాను. వాస్తవానికి ఇది 'నాయక్ నహీ ఖల్నాయక్ హూ మెయిన్' పాటకు రీమేక్ అనుకున్నాను" అని ఆమె వివరించారు. కన్నడలో సాహిత్యం తనకు అర్థం కాకపోవడంతో వారు చెప్పిందే నమ్మానని, అందులో అసభ్యత ఏమీ అనిపించలేదని



అన్నారు. అయితే, హిందీలో డబ్ చేసి విడుదల చేయడానికి తన నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, ఈ విషయం తన దృష్టికే రాలేదని ఆమె ఆరోపించారు. పాట లాంచ్ ఈవెంట్‌లో కూడా తనకు ఇబ్బందికరమైన అనుభవాలు ఎదురయ్యాయని నోరా వెల్లడించారు. లిరికల్ వీడియోలో బాగాలేని ఫొటోలు, తనతో పాటు సంజయ్ దత్‌కు సంబంధించిన ఏఐ ఫొటోను వాడటం చూసి చాలా చిరాకు పడ్డానని, అయినా నిగ్రహం పాటించానని చెప్పారు. హిందీ వెర్షన్ చూసిన తర్వాత ఇది కచ్చితంగా విమర్శల పాలవుతుందని ముందే ఊహించి, ఈ విషయం దర్శకుడికి చెప్పి ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విమర్శల కారణంగానే మేకర్స్ పాటను తొలగించారని, అందుకు తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. "ఇలాంటి కంటెంట్ సృష్టించే దర్శక, నిర్మాతలు బాధ్యత వహించాలి. ఇకపై నేను మరింత జాగ్రత్తగా ఉంటాను" అని నోరా పేర్కొన్నారు.


## సినిమా

# శర్వా సరసన బుట్టబొమ్మ



శర్వానంద్ సినిమా అంటే మినిమమ్ గ్యారెంటి ఉంటుంది. ఇప్పుడు ఈ కుర్ర హీరో దర్శకుడు శ్రీను వైట్లతో చేతులు కలిపాడు. శర్వానంద్, శ్రీను వైట్ల కాంబోలో వస్తున్న ఈ క్లీన్ ఎంటర్టైనర్, సైన్స్ ఫిక్షన్ మూవీలో ఇండస్ట్రీలో హ్యాపెనింగ్ కమెడియన్స్ వెన్నెల కిషోర్, సత్య, బుల్లి రాజు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రజెంట్ స్క్రిప్ట్ వర్క్ జరుగుతుండగా.. జూన్, జులై నుంచి షూటింగ్ ఉండచ్చని ఫిలిమ్ వర్గాల నుంచి టాక్. 2027 సంక్రాంతి టార్గెట్‌గా రూపొందబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ వచ్చింది. ఇందులో ఫీమేల్ లీడ్ కోసం టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డేను సంప్రదించగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిస్తుంది. అనుకున్నవి అనుకున్నట్లు జరిగితే త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. శర్వా నంద్ ప్రస్తుతం భోగితో బిజీగా ఉన్నాడు.

# గెస్ట్‌రోల్‌కు రూ.2.5 కోట్లు



బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించిన మూవీ ధురంధర్. రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మౌత్ టాక్‌తో రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి సంచలనం సృష్టించింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా వస్తున్న ధురంధర్ 2పై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. మార్చి 19న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ మూవీ అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఇప్పటికే రికార్డుల మోత మొదలు పెట్టింది. కేవలం అడ్వాన్స్ సేల్స్ ద్వారానే వంద కోట్ల మార్కుని దాటడం ట్రేడ్ వర్గాలని షాక్‌కు గురి చేస్తోంది. ఇందులో రెహమాన్ డకాయత్ క్యారెక్టర్ ప్రధాన హైలైట్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ క్యారెక్టర్ ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం అక్షయ్ ఖన్నా స్వాగ్. ఆ క్యారెక్టర్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో వస్తుందట. నిడివి కూడా చాలా తక్కువేనట. ఇంత చిన్న గెస్ట్ రోల్ పోషించడానికి అక్షయ్ ఖన్నా రూ.2.5 కోట్లు ఛార్జ్ చేశాడట.


# సరైందే చేస్తం





కన్నడ యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా కథానాయకుడిగా రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం కేడీ: ది డెవిల్. ఇందులో సంజయ్ దత్, శిల్పా శెట్టి, నోరా ఫతేహి, రీష్మా కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ పాన్ ఇండియా మూవీ ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతోన్న వేళ ఇందులోని సర్కే చునర్ పాట తీవ్ర వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. అన్ని వేదికల్లోనూ ఈ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రేమ్ భార్య, నటి రక్షిత స్పందిస్తూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక సుదీర్ఘ నోట్ విడుదల చేసింది. గతంలో వందలాది పాటలు, శృంగారమే ప్రధానాంశంగా సినిమాలు వచ్చినప్పుడు ఎవరికీ ఇబ్బంది కలగలేదని పేర్కొంది. ఒక్క పాట విషయంలో ఇంత గందరగోళం ఎందుకు జరుగుతుందో తనకు అర్థం కావడం లేదని చెప్పింది. తాను దీన్ని సమర్థించడం లేదని, కానీ ఈ వివక్షను అర్థం చేసుకోవాలని ఈ పోస్ట్ పెడుతున్నట్లు తెలిపింది. ఒక్క పాట సరిగ్గా లేనంత మాత్రాన ఆయన చెడ్డ రచయిత అయిపోరంది. రాబోయే కొన్ని రోజుల్లో అంతా సర్దుకుంటుందని తనకు నమ్మకం ఉందని, తమకు కొంచెం సమయం ఇవ్వండని కోరింది. తాను, ప్రేమ్ ధైర్యంగా ఉన్నామని, కేడీ తమకు బిడ్డ లాంటిదని, చివరికి తాము ఏది సరైనదో అదే చేస్తామని వెల్లడించింది.

## హీరోల ఆలోచనా విధానంపై తాప్సీ విమర్శలు



బాలీవుడ్ 'ఫైర్ బ్రాండ్' తాప్సీ పన్ను తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా అగ్ర హీరోల అభద్రతా భావం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. తాప్సీ తన తాజా ఇంటర్వ్యూలో హీరోల ఆలోచనా విధానాన్ని ఎండగట్టింది. కథానాయికలకు ప్రాధాన్యత ఉన్న సినిమాల్లో నటించడానికి చాలా మంది స్టార్ హీరోలు సిద్ధంగా లేరని ఆమె విమర్శించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని తాప్సీ పంచుకుంది. "ఒక సినిమాలో నేను డబుల్ రోల్ చేస్తున్నప్పుడు, సదరు హీరో ఆ ప్రాజెక్ట్‌ను రిజెక్ట్ చేశాడు. దానికి ఆయన చెప్పిన కారణం ఏంటంటే.. సినిమాలో హీరోయిన్ పాత్రకు ఎక్కువ నిడివి, ప్రాధాన్యత ఉంటే చివరకు ప్రేక్షకుల సానుభూతి, ప్రశంసలు ఆమెకే దక్కుతాయని ఆయన భయపడ్డాడు. అంతకుముందే ఆ హీరోతో తాను కలిసి పనిచేసినప్పటికీ... కేవలం తన పాత్రకు ప్రాధాన్యత ఎక్కువగా ఉందనే అభద్రతా భావంతో ఆయన వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది" అని తాప్సీ వెల్లడించింది. కేవలం సీనియర్ హీరోలే కాదు, ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువ హీరోలు కూడా హీరో పాత్ర నిడివి తక్కువగా ఉంటే అటువంటి సినిమాలకు దూరంగా ఉంటున్నారని ఆమె విమర్శించింది. హీరోయిన్ డామినేట్ చేస్తుందనే భయంతో మంచి కథలను వదులుకోవడం వల్ల చిత్ర పరిశ్రమలో సమానత్వం అనేది ప్రశ్నార్థకంగా మారుతోందని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం తాప్సీ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## క్షమాపణలు చెప్పిన 'ఉస్తాద్ భగత్ సింగ్' విలన్.. కారణమిదే!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా, హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్ర పోషించిన ప్రముఖ తమిళ నటుడు రాధాకృష్ణన్ పార్తిబన్, ఇటీవల ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు స్పందిస్తూ బహిరంగ క్షమాపణలు తెలిపారు. అనుకోకుండా నోరు జారడం వల్లే అలా మాట్లాడానని, తనను క్షమించాలని కోరారు.

**అసలేం జరిగిందంటే..!**

'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రచారంలో భాగంగా ఇటీవల హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ వేడుకలో పాల్గొన్న పార్తిబన్, తనను తాను పరిచయం చేసుకుంటూ తన కులం పేరును ప్రస్తావించారు. తాను నాయుడు అబ్బాయినని, కానీ చెన్నైలో పెరగడం వల్ల తమిళం బాగా మాట్లాడతానని అన్నారు. బహిరంగ వేదికపై కులం పేరు ప్రస్తావించడంపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. నెటిజన్లు ఆయన్ను ట్రోల్ చేయడంతో పార్తిబన్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వివరణ ఇస్తూ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

**వివరణలో ఏమన్నారంటే..!**

"నేను ఎలాంటి దురుద్దేశం లేకుండా, చిత్తశుద్ధితో మాట్లాడుతున్నాను. అనుకోకుండా నోరు జారింది. కేవలం పరిహాసంగానే ఆ మాటలు పలికాను. నా ఇన్నేళ్ల అనుభవంలో ఒక కులం పేరును ప్రస్తావించడం ఇదే మొదటిసారి. నిజానికి కులాన్ని గొప్పగా చాటుకునే వారిని నేనే తీవ్రంగా ద్వేషిస్తాను. 'ఇవన్' సహా నా సినిమాల్లో, ఇతర వేదికలపైనా కులతత్వాన్ని తీవ్రంగా ఖండించాను. అలాంటి నేను ఉద్దేశపూర్వకంగా ఇలా చేస్తానా?" అని పార్తిబన్ ప్రశ్నించారు. "తప్పు జరిగిందని పూర్తిగా అంగీకరిస్తున్నాను. అందుకు చింతిస్తున్నాను. నా మాటల వల్ల బాధపడిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక క్షమాపణలు చెబుతున్నాను. నా జీవనోపాధి కోసం కులాన్ని వాడుకోవాలనే ఆలోచన నాకు లేదు. నా ప్రతిభను మాత్రమే నమ్ముకుంటాను.

# కమ్యూనిస్టు పార్టీ ముసుగులో భూ దందా

- నా భూమిని లాక్కునేందుకు దౌర్జన్యం!
  – సుబ్బరాజేశ్వరరావు ఆవేదన
- కోర్టు ఆర్డర్ ఉన్న లెక్క చేయని వైనం

పోరుమామిళ్ల (భారతశక్తి ప్రతినిధి) మార్చి 18: కాశి నాయన మండలం ఇటుకుల పాడు గ్రామ పొలం సర్వేనెంబర్ 458 లో 18.40 సెంట్ల రిజిస్టర్ భూమిని యనమల రాములు అనే ఆమె వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేపించుకున్న భూమిని ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు తమపై దౌర్జన్యం చేస్తున్నారని గ్రామానికి చెందిన గంజికుంట సుబ్బ రాజేశ్వర రావు ఆరోపించారు. ఈ సర్వే నెంబర్ ఆర్ ఎస్ ఆర్ ప్రకారం ఆకుల రోసిగాడు, ఓబిగాడు అనే వారి పేర్ల మీద ఉంది. అయితే 1966లో విక్రయ అగ్రిమెంట్ కింద తమ అబ్బ గారు అయినా గంజి కుంట చెన్న కేశవులు కి అమ్మినారు. తదనంతరం ఆ భూమిని అదే గ్రామానికి చెందిన యనమల రాములు అనే ఆమెకు విక్రయ అగ్రిమెంట్ ద్వారా 1989లో అమ్మడం జరిగిందన్నారు. అప్పటినుంచి ఆమె గవర్నమెంట్ కు శిస్తు కట్టుకుంటూ భూమిలో సాగు చేస్తూ ఉండేది. ఆమె పేరున అన్ని రికార్డులు ఉన్నాయి. అయితే 2018లో నరసాపురం సొసైటీ బ్యాంకులో మార్టిగేజ్ లోను కూడా తెచ్చుకుంది. తాను ఆర్మీ ఉద్యోగిగా రిటైర్డ్ అయిన తర్వాత తమకు వచ్చిన డబ్బుతో తమ అబ్బ గారు అమ్మిన ఈ భూమిని మళ్లీ మేము కొనాలని కోరగా ఆమె సొసైటీ బ్యాంకులో ఉన్న రుణాన్ని క్లియర్ చేసి తమకు 2019లో రిజిస్ట్రేషన్ చేపించడం జరిగింది అన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు తమ ఆధీనంలో ఉంది. కొన్ని రోజులకు మైదుకూరు కు చెందిన ఆకుల ఓబులేసు అనే వ్యక్తి పేరున దొంగ పాస్ పుస్తకాలు సృష్టించి సావిశెట్టిపల్లి గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు పోలయ్య, ఇటుకులపాడు గ్రామానికి చెందిన ఆదినారాయణ రెడ్డి, రమణారెడ్డి, బాలయ్య, చిన్న కొండయ్య, పిచ్చయ్య, మల్లయ్య, పీరయ్య తదితర వ్యక్తులు తమ భూమిని ఆక్రమించేందుకు దౌర్జన్యం చేస్తూ తమను మానసికంగా వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లోనే పోలీస్ స్టేషన్లో, రెవెన్యూ కార్యాలయం లో ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం న్యాయ స్థానాన్ని ఆశ్రయించగా తమకు ఉన్న అన్ని డాక్యుమెంట్లను పరిశీలించి ఇన్ట్రీమ్ ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వడం జరిగింది. పూర్తి ఆర్డర్ వచ్చేంతవరకు ఈ ఆర్డర్ మాకు ఉందన్నారు. ఈనెల 8వ తేదీ సేద్యం చేస్తుండగా తనను చంపుతామని బెదిరించగా భయపడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేయడం కూడా జరిగిందన్నారు. మేము సాగులో లేమని ఈ భూమి మాకు చెందినది కాదని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు. అన్ని డాక్యుమెంట్లు చూసే తమకు కోర్టు ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. తమ భూమిని ఆక్రమించేందుకు వీరంతా కుమ్మక్కై తమపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. వీరందరూ కలిసి మా మీద ప్రభుత్వ అధికారుల మీద తప్పుడు ఆరోపణలు చేస్తూ పేపర్ స్టేట్మెంట్లు ఇస్తున్నారన్నారు. ఈ భూమి ఎవరికి చెందినది అనే అంశం అధికారులకు అందరికీ తెలుసు అన్నారు. వారి దగ్గర ఉన్న పాస్ బుక్కులను పరిశీలిస్తే వారు నకిలీ పత్రాలు ఏ విధంగా సృష్టించారో అర్థమవుతుందని వారు గుర్తు చేశారు. తమకు న్యాయస్థానం, పోలీస్ వ్యవస్థ రక్షణ కల్పిస్తుందని నమ్మకం ఉంది అన్నారు. కావున జిల్లా ఉన్నత అధికారులు స్పందించి తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బెదిరింపులకు గురి చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



# బయటి దొరికే ఫుడ్ ఇప్పుడు ఇంట్లోనే...

వానాకాలంలో చిరుతిళ్లు తినడం బాగా ఎంజాయ్ చేస్తారు. అయితే, అలాగని బయటి ఫుడ్ తింటే ఆరోగ్యం పాడవుతుంది ఎలాగా? అని ఆలోచిస్తుంటారు. అయితే, బయట దొరికే ఫుడ్‌ని ఇలా ఇంట్లోనే ఈజీగా చేసుకోండి.



### ఎగ్ పఫ్ కావాల్సినవి

- గోధుమ పిండి – రెండు కప్పులు
- కోడిగుడ్లు (ఉడికిన) – నాలుగు
- ఉప్పు, నీళ్లు, నూనె – సరిపడా
- వెన్న – మూడు టీస్పూన్లు
- పచ్చిమిర్చి – మూడు
- ఉల్లిగడ్డలు, టొమాటోలు – రెండేసి చొప్పున
- కారం – ఒక టీస్పూన్
- పసుపు – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- గరం మసాలా – ఒక టీస్పూన్
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్

**తయారీ :** ఒక గిన్నెలో గోధుమ పిండి, ఉప్పు, వెన్న వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. దాన్ని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టాలి. తర్వాత ఒక గిన్నెలో పెట్టి మూతపెట్టి పక్కనపెట్టాలి. ఒక పాన్‌లో నూనె వేడి చేసి, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, టొమాటో తరుగు, ఉప్పు వేసి వేగించాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా వేసి కలపాలి. ఆ తర్వాత గిన్నెలో పెట్టిన పిండిని తీసి, ఉండలు చేయాలి. వాటిని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టి మరోసారి వత్తాలి. ఇలా మూడు లేదా నాలుగు సార్లు చేశాక, నాలుగు భాగాలుగా కట్ చేయాలి. ఒక్కోదాంట్లో రెడీ చేసిన స్టఫింగ్ దాంతోపాటు సగానికి కోసిన కోడిగుడ్డు పెట్టి మూసేయాలి. ఇడ్లీ ప్లేట్‌కి నూనె రాసి, వాటిని అందులో పెట్టాలి. మరో పాన్ లో చిన్న గిన్నె బోర్లించి, దానిపై ఇడ్లీ ప్లేట్ పెట్టి మూతపెట్టాలి. కాసేపటి తర్వాత మూత తీసి, వాటిని రెండోవైపు తిప్పి పెట్టాలి. మళ్లీ మూతపెట్టి ఉడికించాలి






### మసాలా కార్న్ టోస్ట్ కావాల్సినవి

- నూనె – రెండు టేబుల్ స్పూన్లు
- వెల్లుల్లి తరుగు – ఒక టేబుల్ స్పూన్
- ఉల్లిగడ్డ తరుగు – ఒక కప్పు
- జీలకర్ర పొడి – అర టీస్పూన్
- పచ్చిమిర్చి – ఒకటి
- కారం – ఒక టీస్పూన్
- గరం మసాలా – పావు టీస్పూన్
- ఫ్రెష్ క్రీమ్ – అర కప్పు
- చీజ్ – అర కప్పు
- కొత్తిమీర – కొంచెం
- వెన్న – ఒక టీస్పూన్
- బ్రెడ్ ముక్కలు – ఆరు

**తయారీ :** పాన్‌లో నూనె వేడి చేసి, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తరుగు, మొక్కజొన్న గింజలు ఒకదాని తర్వాత ఒకటి వేసి వేగించాలి. అందులో కారం, జీలకర్ర పొడి, గరం మసాలా, ఫ్రెష్ క్రీమ్, చీజ్ కూడా ఒక్కోటిగా వేస్తూ కలపాలి. ఆ తర్వాత పాన్‌లో వెన్న వేడి చేసి బ్రెడ్ ముక్కని అందులో పెట్టాలి. దానిపై కార్న్ మిశ్రమం పెట్టి, చీజ్ చల్లి మూతపెట్టి కాసేపు ఉడికించాలి. తర్వాత బ్రెడ్ ముక్కల్ని కట్ చేసి, కొత్తిమీర తరుగు చల్లాలి.





### ఆలూ మటర్ పఫ్ కావాల్సినవి

- గోధుమ పిండి – ఒక కప్పు
- నూనె, ఉప్పు, నీళ్లు – సరిపడా
- వాము – అర టీస్పూన్
- జీలకర్ర – అర టీస్పూన్
- పసుపు – అర టీస్పూన్
- గరం మసాలా – అర టీస్పూన్
- మొలకెత్తిన పచ్చి బఠానీ – ఒక కప్పు
- పచ్చిమిర్చి – మూడు
- ఆలుగడ్డ, ఉల్లిగడ్డ – ఒక్కోటి
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- నిమ్మరసం – ఒక టీస్పూన్
- కార్న్‌ఫ్లోర్ – నాలుగు టేబుల్ స్పూన్లు

**తయారీ :** ఒక గిన్నెలో గోధుమ పిండి, వాము, నూనె, ఉప్పు వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. మూతపెట్టి పది నిమిషాలు పక్కన పెట్టాలి. మిక్సీజార్‌లో మొలకెత్తిన పచ్చి బఠానీ, పచ్చిమిర్చి, ఆలుగడ్డ తరుగు, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. పాన్‌లో నూనె వేడి చేసి, జీలకర్ర, ఉల్లిగడ్డ తరుగు వేసి వేగించాలి. ఆ తర్వాత అందులో ఆలూ బఠానీ మిశ్రమం కూడా వేసి కలపాలి. అందులో నీళ్లు పోసి మూత పెట్టి ఉడికించాలి. ఆపై పసుపు, గరం మసాలా, ధనియాల పొడి, నిమ్మరసం, కొత్తిమీర వేసి కలపాలి. ఒక గిన్నెలో కార్న్‌ఫ్లోర్, నూనె వేసి పేస్ట్‌లా కలపాలి. రెడీ చేసిన పిండి ముద్దను ఉండలు చేసి, చపాతీల్లా వత్తాలి. ఒక్కో చపాతీకి ఆ పేస్ట్ పూసి, పిండి చల్లాలి. అలా నాలుగైదు చపాతీలను ఒకదానిపై ఒకటి పేర్చాలి. తర్వాత వాటన్నింటిని రోల్‌లా చుట్టి, రింగులుగా కట్ చేయాలి. వాటిని మరోసారి చపాతీల్లా వత్తి, నాలుగు ముక్కలుగా కట్ చేసి, ఒక్కోదాంట్లో ఆలూ బఠానీ స్టఫ్ పెట్టి, మూసేయాలి. అలా చేసిన వాటిని వేడి నూనెలో వేగిస్తే ఆలూ మటర్ పఫ్ రెడీ.






# కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే...

**కోపంలో ఫ్రస్టేషన్, బాధ, అలగడం, దిగులు వంటివి కూడా ఉంటాయి. కోపం ఎక్స్‌ప్రెస్ చేసే విధానాన్ని బట్టి రిజల్ట్ వస్తుంది. అప్పుడప్పుడు చిరాకు, కోపం, విసుగు వంటివి రావడం సహజమే. మరి దీన్నుంచి బయటపడేదెలా?**

- కోపం వస్తే.... మొదట చేయాల్సిన పని డీప్ బ్రీత్ తీసుకోవడం. కోపం తగ్గేవరకూ నిదానంగా శ్వాస తీసుకుంటూ... వదులుతూ ఉండాలి. తర్వాత మనలో మనం పాజిటివ్‌గా మాట్లాడుకోవాలి.
- కోపం ఎప్పుడు వచ్చినా దాన్ని ఎక్స్‌ప్రెస్ చేయకపోవడమే మంచిది. ఒకవేళ కోప్పడాల్సి వస్తే దాన్ని ఎక్స్‌ప్రెస్ చేసే విధానంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఒక్కోసారి చిన్న చిన్నవాటికే ఎక్కువ కోపం చూపిస్తే అవి రిలేషన్‌షిప్ మీద ఎఫెక్ట్ చూపిస్తాయి.
- మీకు సపోర్ట్ చేసే వాళ్లకి మీ ఫీలింగ్స్ గురించి చెప్పండి. కాసేపు వాళ్లతో డిస్కస్ చేయండి. ప్రాబ్లమ్ ఏదైనా కోప్పడకుండా దాన్ని ఎలా సాల్వ్ చేయగలమో అని ఆలోచించాలి.
- ప్రాబ్లమ్ చిన్నదైతే ఎక్కువ రియాక్ట్ అవ్వకుండా ఉండేందుకు ప్రయత్నించాలి.
- నలుగురిలో ఉన్నప్పుడు వీలైనంత వరకూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండాలి.
- కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే ముందు ఎదుటి వాళ్లు చెప్పేది వినాలి. ఎందుకంటే వినడం కూడా ఒక కళే, ముందు అది నేర్చుకోవాలి. కమ్యూనికేషన్ పెంచుకోవాలి.

ఇద్దరు మాట్లాడుకుంటుంటే ఒకరి మీద ఒకరికి నమ్మకం ఉండడం చాలా ఇంపార్టెంట్.

- అసౌకర్యంగా అనిపించే చోటు నుంచి దూరంగా వెళ్లాలి. కాసేపు హాయిగా నేచర్‌ను చూస్తూ వాకింగ్ చేయాలి.
- మీకు నచ్చిన పుస్తకాలు లేదా మోటివేట్ చేసే పుస్తకాలను చదువుకోవాలి. ఈ ప్రాబ్లమ్ మరీ ఎక్కువ ఉంటే ప్రొఫెషనల్ థెరపిస్ట్‌ను కలవడం మంచిది. ఆల్కహాల్ లేదా డ్రగ్స్ వంటి అలవాట్లు ఏవైనా ఉంటే కచ్చితంగా వాటిని మానుకోవాలి.
- కోపం వల్ల రిలేషన్‌షిప్స్ దెబ్బతింటాయి. దానివల్ల హెల్త్ ప్రాబ్లమ్స్ కూడా వస్తాయి. కోపం ఎక్కువ రోజులుంటే బీపీ పెరుగుతుంది. హార్ట్ ప్రాబ్లమ్స్, తలనొప్పి, స్కిన్ డిజార్డర్స్, అరుగుదల సమస్యలు వంటివి వస్తాయి. అంతేకాకుండా ఆల్కహాల్ తాగడం, క్రైమ్ చేయడం, ఇతరులను అవమానించడం వంటివి జరుగుతాయి.

## పచ్చిమిర్చిని ఇలా కూడా వాడొచ్చు!



- పచ్చిమిర్చి కట్ చేసిన తర్వాత కొందరికి చేతులు మండుతాయి. అలాంటప్పుడు చేతులకు పంచదార రుద్దుకుంటే మంచి ఉపశమనం లభిస్తుంది.
- మాంసాన్నివేయించేటప్పుడు అది బంగారు గోధుమ రంగులో మంచి లుక్ రావాలంటే మాంసంపై మిరపకాయ ముక్కలను చల్లితే చాలు.
- పచ్చిమిరపకాయల్ని కాసింత పసుపుతో చేర్చి సీసాలో నిలువ చేస్తే ఎరుపు రంగుకు మారకుండా ఉంటాయి.
- పచ్చిమిర్చి ఎక్కువ రోజులు ఫ్రెష్ ఉండాలంటే మొదట శుభ్రంగా కడిగి, ఆరబెట్టాలి. మిర్చి తొడిమలు తీసి, గాలి చొరబడని డబ్బా అడుగున టిష్యూ పేపర్ వేసి మిర్చిని దానిపై పెట్టాలి. వాటిపైన టిష్యూ పేపర్ వేసి మూత పెట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. పదిహేను రోజులకొకసారి టిష్యూ పేపర్ మార్చితే రెండు నెలల పాటు పచ్చిమిర్చి

# డ్రగ్ టెస్ట్ ఛాలెంజ్‌పై యూత్ కాంగ్రెస్ స్పందన



ఎల్బీనగర్, మార్చి 18 (భారత శక్తి): మొయినాబాద్ ఫార్మ్‌హౌస్ ఘటనలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన నేపథ్యంలో, ఎల్బీనగర్ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులకు వైట్ ఛాలెంజ్ విసరడం విడ్డూరంగా ఉందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి పేర్కొన్నారు. దిల్‌సుఖ్ నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకులు తమ ఎమ్మెల్యేతో కలిసి వైట్ ఛాలెంజ్‌కు వస్తే,ఎల్బీనగర్ కాంగ్రెస్ నాయకులు కూడా ఆ సవాల్‌ను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. "మేము సిద్ధంగా ఉన్నాం...మీ ఎమ్మెల్యే సిద్ధమా?" అంటూ ప్రతి సవాల్ విసిరారు.వైట్ ఛాలెంజ్‌కు సిద్ధమైతే, ఉగాది రోజున మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీ నగర్,కామినేని చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి డ్రగ్ టెస్ట్‌కు హాజరు కావాలని ఆయన సవాల్ చేశారు. ఈ పరీక్ష కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు కాంగ్రెస్ పార్టీ తరఫున సిద్ధం చేస్తామని తెలిపారు.గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ హబ్‌గా మార్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని విమర్శించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు బీఆర్ఎస్ నాయకత్వం వెనుకంజ వేసిందని ఆరోపించారు. డ్రగ్స్ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులే తిరిగి సవాళ్లు విసరడం సమంజసం కాదని అన్నారు.ఈ సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరమల రామచంద్రా రెడ్డి,ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వలస సుభాష్ చంద్రబోస్ కు ఘన సన్మానం

* భవిష్యత్ లో మరిన్ని సేవకార్యక్రమాలు చేపట్టాలి
- మై భారత్ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్



భారత శక్తి సిద్దిపేట, మార్చి 18 (భారత శక్తి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో "మై భారత్ - మేరా యువ భారత్" ఆధ్వర్యంలో సోషల్ సర్వీస్ డే సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు వలస సుభాష్ చంద్రబోస్ ని మై భారత్ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్ ఘనంగా శాలువాతో సత్కరించి మెమొంటో ను అందజేశారు. ఈ సందర్భంగా జి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే వ్యక్తులు ఎంతో అవసరమని, వలస సుభాష్ చంద్రబోస్ నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత సేవా కార్యక్రమాలలో పాల్గొని సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత దొమ్మాట రాజు, యువ న్యాయవాది ఎన్. లింగం తదితరులు పాల్గొన్నారు.

## బొప్పాపూర్ గ్రామంలో
# బహిరంగ మలవిసర్జన నిషేధం

- సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్




సిద్దిపేట, మార్చి 18 (భారత శక్తి): బొప్పాపూర్ గ్రామంలో బహిరంగ మలవిసర్జనను పూర్తిగా నిషేధిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ తెలిపారు. గ్రామ పరిశుభ్రత మరియు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా భాను ప్రసాద్ మాట్లాడుతూ రేపటి నుండి గ్రామ పరిధిలో ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు. ప్రస్తుతం గ్రామ చెరువు పరిసరాల్లో ఉపాధి హామీ పథకం (EGS) కింద పనులు కొనసాగుతున్నందున, ఆ ప్రాంతంలో మలవిసర్జన పూర్తిగా నిషేధించబడిందన్నారు.గ్రామ ప్రజలు తప్పనిసరిగా తమ ఇళ్లలోని మరుగుదొడ్లను వినియోగించుకోవాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా మరియు ఆరోగ్యవంతంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య....



సిద్దిపేట ప్రతినిధి, మార్చి 18 (భారత శక్తి): చేతికి అంది వచ్చిన పంట నీరు లేక ఎండిపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక జీవితం మీద విరక్తి చెందిన రైతు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక మండలం రగోత్తంపల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రెడ్డి మోహన్ రెడ్డి (40) భార్యా,పిల్లలతో జీవనం కొనసాగిస్తూ, తనకున్న వ్యవసాయ భూమిలో వరిని సాగు చేస్తున్నాడు.ఇటీవల వేసిన వరి పంట సాగుకు నీరు లేకపోవడంతో, అప్పులు చేసి రెండు బోర్లు వేసినా నీరు రాలేదు. ఫలితంగా ఒకవైపు పంట ఎండిపోవడంతో పాటు చేసిన అప్పులు పెరిగిపోయాయి. దీంతో తీవ్ర మనోవేదనకు గురై బుధవారం ఉదయం మోహన్ రెడ్డి తన పొలం ఒడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని, పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి రంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక ఎస్సై తెలిపారు.

# జిల్లా ప్రజలకు ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు

: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మార్చి 18 (భారత శక్తి) : శ్రీ పరాభవనామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్య సౌభాగ్యాలను నింపాలని కోరుకుంటూ అలాగే పవిత్ర రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలందరికీ ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడులు ఉగాది మరియు రంజాన్ పండుగ శుభాకాంక్షలు జిల్లా ప్రజలకు తెలియజేశారు. వ్యవసాయాధారిత జీవనం సాగించే తెలుగు రాష్ట్రాలలో ఉగాది పండుగకు ప్రత్యేకత ఉందని పులుపు, తీపి, వగరు, చేదు, ఉప్పు, కారం అనే ఆరు రుచుల కలయికగా ఉగాది పచ్చడిని రూపొందిస్తామని, వైద్య పరంగా ఈ ఉగాది పచ్చడి వేసవి వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుందన్నారు. ఈ శ్రీ పరాభవనామ తెలుగు సంవత్సరంలో ప్రకృతి అన్నివిధాలా కరుణించి జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి సిరుల పంటలు పండాలన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని ఈ సందర్భంగా వారు అభిలషించారు. ఆధ్యాత్మికంగా చూస్తే జీవితం సుఖదుఃఖాల మిశ్రమం అని చెప్పడమే ఉద్దేశ్యంగా ఉగాది జోష్యం చెబుతోందన్నారు. జీవన గమనం శుభాశుభాల మిశ్రమం అని గ్రహిస్తూనే, రాబోయే రోజులకి సిద్ధపడాలని సూచించే సంప్రదాయమే మన "పంచాంగం" అన్నారు. అందుకే సంవత్సరపు మొదటి రోజైన ఉగాది నాడు పంచాంగ శ్రవణం తప్పక ఆచరించడం మన ఆనవాయితీ అని గుర్తు చేశారు. పవిత్రత, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల మేళవింపు పర్వదినమైన రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వ సుపరిపాలన, బాధ్యత, నిబద్ధత, సంక్షేమ పథకాల ఫలాలతో రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రతిరోజు పండుగలా సంతోషాల సౌరభాలు వెల్లివిరుస్తున్నాయన్నారు.

# దివ్యాంగుల పాలిట వరం 'దివ్యాంగ శక్తి' పథకం..!

- ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి
- జేసీ డా. నిధి మీనా తోకలిసి 'దివ్యాంగ శక్తి' పథకం బస్సు సేవలు ప్రారంభోత్సవం

కడప, మార్చి 18(భారత శక్తి) : ఉగాది కానుకగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'దివ్యాంగ శక్తి' పథకం దివ్యంగుల పాలిట వరం అని రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి ప్రశంశించారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళగిరి ఆర్టీసీ బస్టాండు నుండి దివ్యంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించే "దివ్యంగ శక్తి" పథకానికి శ్రీకారం చుట్టారు. జిల్లా స్థాయిలో కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి, జేసీ డా. నిధి మీనా తోకలిసి 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఉచిత బస్సు పాసులను అందజేసి.. 'దివ్యాంగ శక్తి' బస్సులను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అపురూపమైన ఉగాది కానుకగా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని అమలు చేసి ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం అభినదనీయం అన్నారు. ఈ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని మరోసారి నిరూపించింది. గతేడాది డిసెంబర్ 3న నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని మాటిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ మాట నిలబెట్టుకుని నిజమైన నాయకుడిగా ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించిన ముఖ్యమంత్రి మరో అడుగు ముందుకేసి దివ్యంగ శక్తి పథకం ద్వారా దివ్యంగులకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించడం గర్వించదగ్గ విషయం అన్నారు. రాష్ట్రంలో 2.38 కోట్ల మంది మహిళలు స్టర్ శక్తి పథకం ద్వారా లబ్ధి పొందుతుండగా పథకం ప్రారంభం నటి నుండి ఇప్పటి వరకు YSR కడప జిల్లా ఆర్టీసి మహిళల ఉచిత ప్రయాణానికి సుమారు 100 కోట్ల రూపాయలు ఖర్చుచేయడము జరిగిందన్నారు. ఈ ఖర్చు ప్రభుత్వానికి భారం అయినా కుడా దివ్యంగులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలనే ఆలోచనతో 'దివ్యాంగ శక్తి' పథకానికి డ్రీకరం చుట్టారన్నారు.

* 'స్త్రీశక్తి' బస్సులే 'దివ్యాంగ శక్తి'కి వర్తింపు*

ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు, 100 శాతం కంటి చూపు కోల్పోయిన వాళ్లకు, 100 శాతం మూగ, చెవిటి వారికి, అలాగే 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులు మాత్రమే ఏపీఎస్ ఆర్టీసీ సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వీరికి 50 శాతం రాయితీ లభిస్తోందన్నారు. 100 శాతం అంధత్వం, మానసిక వైకల్యం ఉన్నవారితో వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ లభిస్తోందన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 'దివ్యాంగ శక్తి' పథకం కింద దివ్యాంగులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. 40 శాతం, లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు అందరికీ స్త్రీశక్తి పథకం కింద వర్తించే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. ఆ విధంగా దివ్యాంగులు ఇకపై సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఒక్క రూపాయి కూడా ఛార్జీ లేకుండా రాష్ట్రమంతా ప్రయాణం చేసే వెసులుబాటు లభించింది. అంతేకాదు, వారితో పాటు వచ్చే సహాయకులకు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీని కల్పిస్తోందన్నారు.

* 4 నుంచి 21 వర్గాలకు పథకం విస్తరణ

ఇప్పటివరకు కేవలం 4 వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం ఇకపై 21 రకాల వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈ సౌకర్యాన్ని విస్తరించడం గర్వించదగ్గ విషయం అన్నారు. శారీరకమానసిక దివ్యాంగులు, ఆటిజం, నాడీ సంబంధ వ్యాధులు, పార్కిన్సన్స్, తలసేమియా, హీమోఫిలియా, సికిల్ సెల్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ పథకంతో మరింత ఆర్థిక వెసులుబాటు కలుగనుందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రవాణా వ్యవస్థలో 1.71 లక్షల దివ్యాంగులకే లబ్ధి చేకూరుతుండగా పథకం విస్తరణతో ఇకపై 11.16 లక్షల మంది దివ్యాంగులకు, 33,800 మంది సహాయకుల (50% రాయితీతో)కు కలిపి మొత్తం 12.76 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుందన్నారు. ఉచిత ప్రయాణానికి అవసరమైన డిజిటల్ పాస్‌లు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్, ఏపీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా పొందవచ్చన్నారు. అంతే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్లలోని 134 కౌంటర్లలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య సేవలు అందుతాయన్నారు. జేసీ డా. నిధి మీనా మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే ప్రతీ వందమందిలో 37 మంది మగవాళ్లు ఉంటే, 63 మంది మహిళలే ఉంటున్నారు. ఇది స్త్రీ శక్తి పథకం ఎంతలా సూపర్ హిట్ అయ్యిందో చెబుతోంది. దివ్యాంగ శక్తి కూడా ఇంతే ఆదరణ పొందుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. దివ్యాంగులకు సమాజంలో సరైన స్థానం, గుర్తింపు, గౌరవం కల్పించే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'దివ్యాంగ శక్తి' పథకంను ప్రవేశ పెట్టిందన్నారు. ప్రస్తుతము కడప జిల్లాలో ఈ పథకము ద్వారా 540 బస్సులలో ఉచితముగా ప్రయాణించుటకు వీలు కలుగుతుందని, సుమారు 3000 దివ్యాంగుల బస్సు పాసులు జారీ చేయడం జరిగిందన్నారు. వీరందరూ ఈ దివ్యాంగ శక్తి పథకము ద్వారా ఉచితముగా ప్రయాణించుటకు అవకాశం కలిగిందని, ఇప్పటివరకు జారీ చేసిన పాసుల గడువు తీరేంతవరకు ఉపయోగించుకొని తదుపరి రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. బస్సు పాసులు లేని 40% అంతకంటే ఎక్కువ వైకల్య శాతము ఉన్నవారికి దివ్యాంగ శక్తి వర్తించేలా బస్సు పాసులు ఆయా డిపోల యందు జారీచేస్తారన్నారు. ఇందుకు గాను సదరం సర్టిఫికేట్ ను పొందుపరచవలసి ఉంటుందన్నారు. పూర్తిగా దృష్టి లోపం ఉన్న వారికి (100%), శారీరక / మానసిక వైకల్యం 69 శాతానికి పైగా ఉన్న వారికి తోడుగా ఎస్కార్టును అనుమతిస్తూ, వారికి 50% రాయితీ టికెట్ జారీచేస్తారన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్నట్లుగానే నాన్‌స్టాప్, ఇంటర్ స్టేట్, అల్ట్రా డీలక్స్, సప్తగిరి బస్సులలో దివ్యాంగులకు 50 శాతము రాయితీతో ప్రయాణ సౌకర్యము అలాగే కొనసాగుతుందన్నారు. దివ్యాంగ శక్తి పథకము అమలవుతున్న సంధర్భముగా ప్రయాణీకుల పట్ల, ప్రత్యేకించి దివ్యాంగుల పట్ల మర్యాద పూర్వకముగా ప్రవర్తించవలెనని కోరారు. బస్ స్టేషన్ మేనేజర్లు/ కంట్రోలర్స్ / ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వారి పట్ల మర్యాద పూర్వకముగా ప్రవర్తించాలని, వారు అడిగిన వాటికి వినయపూర్వకముగా సమాధానాలు చెప్పాలని ఆదేశించడమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి వెంకటపతి, జిల్లా ప్రజా రవాణా అధికారి వేణు గోపాల్ రెడ్డి, కడప ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్. చైతన్య నిరంజన్, ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులు శ్రీనివాసులు రెడ్డి, లబ్ధిదారులైన దివ్యంగులు, వారి సహాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కొనుగోలు కమిటీ (డీపిసి) సమావేశం



కామారెడ్డి జిల్లా, మార్చి 18 (భారత శక్తి): రబీ 2025-26 ప్యాడీ కొనుగోలు ఏర్పాట్లపై జిల్లా కొనుగోలు కమిటీ (డీపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్లో బుధవారం నిర్వహించారు. జిల్లాలో ప్యాడీ కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ల (పిపిసీఎస్) తుది నిర్ణయం, రవాణా ఏర్పాట్లు , నిల్వ స్థలాల లభ్యతపై సమీక్షించారు. ప్యాడీ కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలు, తార్పాలిన్లు, తేమ మీటర్లు, గన్నీ సంచులు, కార్మికులు , రైతులకు తాగునీటి సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని పీపీసీల నుంచి రైస్ మిల్లులు , నిల్వ కేంద్రాలకు వెంటనే తరలించేలా రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే ప్రైవేట్ గోదాములు, ఖాళీగా ఉన్న ఫంక్షన్ హాల్స్ , ఇతర భవనాలను తాత్కాలిక నిల్వ స్థలాలుగా గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో ఎల్పీజీ సరఫరా పరిస్థితిపై కూడా సమీక్ష నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగినంత రీఫిల్లులు అందుబాటులో ఉంచి నిరంతర సరఫరా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మార్చి 11 నుండి 17 వరకు జిల్లాలో గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న వారిపై నిర్వహించిన తనిఖీల్లో 113 కేసులు నమోదు చేసి, 160 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), విక్టర్ , జిల్లా సివిల్ సప్లైస్ అధికారి (డిసిఎస్ఓ), జిల్లా వ్యవసాయ అధికారి (డిఏఓ), జిల్లా సహకార అధికారి (డిసిఓ), డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి ని పరామర్శించిన
# డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి



పోరుమామిళ్ల, మార్చి 18 (భారత శక్తి): బద్వేలు టౌన్ 25వ వార్డు టీడీపీ ఇంచార్జి నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి కాలుకు శస్త్ర చికిత్స జరిగి విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న కడప డిసిసి బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. త్వరలోనే పూర్తిగా కోలుకుని ప్రజా సేవలో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్, చెరుకూరి రవికుమార్, అట్లూరు మండల ఇంచార్జి ఎంపీపీ పోతిరెడ్డి రెడ్డియ్య, బద్వేలు మున్సిపాలిటీ టౌన్ మాజీ అధ్యక్షుడు కొంకుల రాంబాబు, పాలకొల్లు రాజా శేఖర రెడ్డి, ప్రహ్లాదు రెడ్డి, బాలి రెడ్డి, కల్లూరి దుగ్గిరెడ్డి, బోవిళ్ళ నరసింహ రెడ్డి, గోపి రెడ్డి, కొంకుల వెంకట రమణ, గురు ప్రసాద్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, వెంకట సుబ్బయ్య, రామకృష్ణ రెడ్డి కమలకూరు, రఘురామి రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి: నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి, మార్చి 18 (భారత శక్తి): పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టులోని వివిధ ముంపు గ్రామాల నిర్వాసితులతో ఆయన సమావేశమయ్యారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోలేదని, వరద నీటిలో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు. రంపచోడవరం నియోజకవర్గం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రాజెక్టు నిర్వాసితులు రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ ఇళ్లను, భూములను త్యాగం చేశారని అన్నారు. ఈ ఉగాది పండుగను పురస్కరించుకుని నిర్వాసితుల ఖాతాల్లో రూ.226 కోట్లు జమ చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఉగాది తర్వాత రెండు నెలల్లో పోలవరం సాకారమవుతుందని హామీ ఇచ్చారు.గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని ఆరోపించారు. నిపుణులతో అధ్యయనం చేయించి తిరిగి కొత్త నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. వారం రోజుల్లో ఇది పూర్తవుతుందని తెలిపారు. 21 నెలల్లో ప్రాజెక్టు పనులు వేగవంతం చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 2025లో సంక్రాంతి పండుగ సందర్భంగా మొదటి విడతగా నిర్వాసితులకు రూ.800 కోట్లు, దీపావళికి రెండో విడతగా రూ.916 కోట్లు నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. మూడో విడతతో కలిపి, 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1943.53 కోట్లను చెల్లించామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టు రెండు దశలుగా నిర్మితమవుతోందని తెలిపారు. తొలిదశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నట్లు వెల్లడించారు. 75 నిర్వాసిత కాలనీలలో ఇప్పటికే 26 పూర్తయ్యాయని, మిగిలిన49 కాలనీలు నిర్మాణంలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. వీటి నిర్మాణం ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి పూర్తవుతుందని అన్నారు. ప్రతి నిర్వాసితుడికి రూ.3.5 లక్షల మేర ఇంటి నిర్మాణం కోసం ఇస్తున్నామని, ఇంటి స్థలం కోసం ఇచ్చే మొత్తాన్ని రూ.2 లక్షలకు పెంచామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తోందని అన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు చేస్తున్నామని వెల్లడించారు. దళారులను నమ్మి మోసపోవద్దని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి పుష్కరాలు మూడోసారి నిర్వహించే గౌరవం తనకు దక్కిందని ముఖ్యమంత్రి అన్నారు. పుష్కరాల నిర్వహణ కంటే ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని అన్నారు. అలాగే ఈ ప్రాజెక్టు ప్రారంభాని కంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో రూ.5 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులంతా ప్రజల హృదయాల్లో నిలుస్తారని అన్నారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలమే పోలవరం ప్రాజెక్టు అన్నారు. అందరికీ న్యాయం చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం ప్రాజెక్టు ఆరేడేళ్లు ఆలస్యమైందని అన్నారు. నిర్వాసితులంతా సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు.

## మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసుపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ , మార్చి 18 (భారత శక్తి): మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ కేసులో అరెస్టైన వారిలో ఎనిమిది మందికి నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. ఇందులో ముఖ్యమంత్రిగా తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశామని అన్నారు. ఏపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు నిబంధనల మేరకు స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. 2028లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు రాబోవని జోస్యం చెప్పారు. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు ముందుగానే వస్తే సంతోషిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతకుముందు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఇతర నాయకులతో కలిసి ఆయన అధిష్ఠానం పెద్దలతో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు పరిచయం చేశారు.

## భారత్ ట్యాక్సీ సూపర్ సక్సెస్.. డ్రైవర్లకు రూ.35 కోట్ల ఆదాయం

ఢిల్లీ, మార్చి 18 (భారత శక్తి):కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సహకార రైడ్‌హెయిలింగ్ ప్లాట్‌ఫామ్ 'భారత్ ట్యాక్సీ' విజయవంతంగా నడుస్తోందని ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. సుమారు రూ.5 కోట్ల పెట్టుబడితో ఇప్పటివరకు డ్రైవర్లకు రూ.35 కోట్లకు పైగా ఆదాయం అందించిందని తెలిపింది. ఈ చొరవ ద్వారా దాదాపు 20,000 మంది డ్రైవర్లు, 200 మంది సహాయక సిబ్బందికి ఉపాధి అవకాశాలు లభించాయని వెల్లడించింది. ఈ విషయంపై రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా లిఖితపూర్వక సమాధానమిచ్చారు. డ్రైవర్ల సాధికారత, రవాణా రంగంలో సమ్మిళిత వృద్ధికి భారత్ ట్యాక్సీ ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ విధానంలో డ్రైవర్లను 'సారథులు'గా పిలుస్తారని, వారే యజమానులుగా, నిర్ణయాధికారంలో భాగస్వాములుగా ఉంటారని వివరించారు. ప్రస్తుత యాప్ ఆధారిత క్యాబ్ సేవల మాదిరిగా కాకుండా భారత్ ట్యాక్సీ సహకార నమూనాలో పనిచేస్తుంది. డ్రైవర్ల నుంచి ఎలాంటి కమీషన్ వసూలు చేయకుండా, రైడ్ ద్వారా వచ్చిన పూర్తి ఆదాయాన్ని వారికే అందిస్తుంది. దీనికి బదులుగా డ్రైవర్ల నుంచి సబ్‌స్క్రిప్షన్ ఫీజును వసూలు చేస్తుంది. అలాగే ప్రయాణికుల నుంచి కూడా ట్రిప్ ఛార్జీ మాత్రమే వసూలు చేస్తారని, ఎలాంటి కన్వీనియన్స్ ఫీజులు గానీ, సర్జ్ ప్రైసింగ్ గానీ ఉండవని ప్రభుత్వం స్పష్టం చేసింది. 'సహకారం ద్వారా సమృద్ధి' అనే లక్ష్యంతో 2025 జూన్ 6న మల్టీస్టేట్ కో ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్, 2002 కింద భారత్ ట్యాక్సీని స్థాపించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఈ సేవలను అధికారికంగా ప్రారంభించారు. ప్రస్తుతం ఢిల్లీఎన్‌సీఆర్‌తో పాటు గుజరాత్‌లోని అహ్మదాబాద్, రాజ్‌కోట్, సోమనాథ్, ద్వారక నగరాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. దశలవారీగా దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ డ్రైవర్ల ఆదాయాన్ని పెంచడమే కాకుండా, అగ్రిగేటర్ మోడళ్లకు గౌరవప్రదమైన ప్రత్యామ్నాయాన్ని అందించిందని ప్రభుత్వం పేర్కొంది.

## మూసీ ప్రాజెక్టు
## రూ.1.5 లక్షల కోట్ల స్కామ్: కేటీఆర్

హైదరాబాద్ , మార్చి 18 (భారత శక్తి): మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పేరుతో తెలంగాణ ప్రభుత్వం ఏకంగా రూ.1.5 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణానికి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై శాసనసభలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ వైఖరిలో పారదర్శకత లేదని నిరసిస్తూ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో కేటీఆర్ మాట్లాడుతూ.. మూసీ నది పునరుజ్జీవనానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భారీ దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైతే, దానిని ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. డీపీఆర్ లేకుండానే వేల ఇళ్ల కూల్చివేతకు, భూసేకరణకు ఎలా సిద్ధమవుతారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేటీఆర్ ఆరోపణలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టుపై ఎలాంటి దాపరికం లేదని, కేటీఆర్ ఆరోపణలు నిరాధారమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించిన డీపీఆర్ పూర్తయిందని, దాని అంచనా వ్యయం రూ.6,500 కోట్ల నుంచి రూ.7,000 కోట్ల వరకు ఉంటుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వల్ల 1,435 నిర్మాణాలు ప్రభావితం అవుతాయని, తుది గణన జరుగుతోందని తెలిపారు. బఫర్ జోన్‌లో ఉన్న వారికి బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు (టీడీఆర్) ఇస్తామని, భూసేకరణ, పునరావాసం 2013 చట్టం ప్రకారమే జరుగుతుందని హామీ ఇచ్చారు. అయితే, ప్రభుత్వ వాదనను కేటీఆర్ తోసిపుచ్చారు. ముఖ్యమంత్రి బహిరంగ సభల్లో రూ.1.5 లక్షల కోట్ల ప్రాజెక్టు అంటుంటే, సభలో మంత్రులు కేవలం రూ.7,000 కోట్లు అని చెప్పడంలోనే వైరుధ్యం కనిపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం 10,000 ఇళ్లు కూల్చివేస్తారని, 3,260 ఎకరాల భూమిని సేకరించనున్నారని పేర్కొన్నారు. సింగపూర్, పాకిస్థాన్ వంటి దేశాల్లో నిషేధానికి గురైన 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి డీపీఆర్ బాధ్యతలు ఎలా అప్పగించారని ఆయన ప్రశ్నించారు. 18 నెలలు పట్టే డీపీఆర్‌ను రెండు నెలల్లోనే ఎలా పూర్తి చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, స్పష్టమైన ప్రణాళిక కూడా లేదని, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి ఎలాంటి రుణం మంజూరు కాలేదని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ సమాధానంతో సంతృప్తి చెందని ఆయన, పారదర్శకత పాటించడం లేదని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

## దాడుల్లో ఇరాన్ నిఘా వ్యవహారాల మంత్రి మృతి

ఇరాన్, మార్చి 18 : ఇరాన్ నిఘా వ్యవహారాల మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్ తమ దాడుల్లో హతమయ్యారని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ కీలక నేతలు లక్ష్యంగా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) దాడులు కొనసాగిస్తోంది. ఐడీఎఫ్ జరిపిన దాడుల్లో ఇస్మాయిల్ ఖతీబ్ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ వెల్లడించారు. ఖతీబ్ మృతిని ఇరాన్ ధృవీకరించాల్సి ఉంది. ఇరాన్ కీలక నేతల వేట కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఇరాన్ కీలక అధికారులు లక్ష్యంగా దాడులు చేయడానికి, వారిని హతమార్చడానికి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)కు ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని కాట్జ్ తెలిపారు. యుద్ధం ప్రారంభం రోజునే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్, అమెరికా దళాలు మట్టుబెట్టాయి. అలీ ఖమేనీకి అత్యంత సన్నిహితుడిగా ఉన్న అలీ లారిజానీ హతమయ్యారు. తాజాగా ఖతీబ్ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. అలీ ఖమేనీకి ఇస్మాయిల్ ఖతీబ్ అత్యంత సన్నిహితుడిగా పేరు ఉంది.

## జోరువానలో పేద ముస్లిం ఇంటికి మంత్రి లోకేశ్... అక్కడే ఇఫ్తార్ విందు

అమరావతి, మార్చి 18 (భారత శక్తి):పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి పట్టణం, పోలకంపాడులో నివసిస్తున్న షేక్ అమీర్ అనే పేద ముస్లిం యువకుడి ఇంటికి ఆకస్మికంగా వెళ్లారు. జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ ఆయన పర్యటనను ఆపలేదు. అమీర్ కుటుంబసభ్యులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో లోన్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్న షేక్ అమీర్ ఇంటికి మంత్రి లోకేశ్ చేరుకోగానే, ఆయన కుటుంబసభ్యులు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ముస్లిం సంప్రదాయం ప్రకారం టోపీ ధరించిన లోకేశ్, కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అందరితో కలిసి కూర్చుని ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... "ప్రజలకు మేలు చేసేందుకే దేవుడు చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం కల్పించాడు. నేను ప్రతి ఏటా బాధ్యతగా ఒక ముస్లిం సోదరుడి నివాసానికి వెళ్లి ఇఫ్తార్‌లో పాల్గొంటాను. మంగళగిరి ప్రజలు 53 వేల మెజారిటీ అడిగితే 91 వేల మెజారిటీ ఇచ్చారు. వారి నమ్మకాన్ని నిలబెడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం" అని అన్నారు. ఇప్పటికే 3,000 ఇళ్ల పట్టాలు అందించామని, త్వరలోనే మరో 2,000 ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడతామని తెలిపారు. అమీర్ తండ్రి, లారీ డ్రైవర్ అయిన షేక్ అన్వర్ తమ కుటుంబ పరిస్థితులను మంత్రికి వివరించారు. తాము నివసిస్తున్న ఇల్లు ఇరుకుగా ఉందని, వర్షం వస్తే కారుతోందని, పాత రేకుల ఇంటి స్థానంలో కొత్త ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన లోకేశ్, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని, కొత్త ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. పవిత్ర మాసంలో తమ ఇంటికి మంత్రి రావడంతో పాటు సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో అమీర్ కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. అనంతరం మంత్రి వారికి రంజాన్ బహుమతిని అందజేసి తిరుగుపయనమయ్యారు.

## అక్రమ వలసదారులకు ట్రంప్ భారీ ఆఫర్

అమెరికా, మార్చి 18 : అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులను దేశం నుంచి పంపించేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సరికొత్త వ్యూహాన్ని ప్రకటించింది. బలవంతంగా కాకుండా, వారంతట వారే స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లేవారికి భారీ ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఇలా వెళ్లేవారికి 2,600 డాలర్లు (సుమారు రూ. 2.40 లక్షలు) 'ఎగ్జిట్ బోనస్'గా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ నగదు ప్రోత్సాహకంతో పాటు, వారి స్వదేశాలకు వెళ్లేందుకు అయ్యే విమాన ప్రయాణ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించనుంది. ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకునే వారు 'సీబీపీ హోమ్' అనే ప్రత్యేక యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా నమోదు చేసుకున్న వారిని బలవంతపు బహిష్కరణ జాబితా నుంచి తొలగిస్తారు. ఈ కొత్త విధానం వల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా భారీ ఆదా అవుతుందని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. ఒక వలసదారుడిని బలవంతంగా అరెస్ట్ చేసి, దేశం నుంచి పంపడానికి సుమారు 18,245 డాలర్లు ఖర్చవుతుండగా, ఈ స్వచ్ఛంద పథకానికి కేవలం 5,100 డాలర్లతోనే పని పూర్తవుతుందని తెలిపింది. ఇది అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బును ఆదా చేస్తుందని వివరించింది. అయితే, ఈ అవకాశాన్ని వినియోగించుకోని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. ''గౌరవంగా వెళ్లిపోండి, లేదంటే మేమే పట్టుకుని అరెస్ట్ చేస్తాం. అప్పుడు మళ్లీ అమెరికాలో అడుగుపెట్టలేరు'' అని సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోమ్ స్పష్టం చేశారు. గతంలో 1,000 డాలర్లుగా ఉన్న ఈ బోనస్‌ను, ట్రంప్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా 2,600 డాలర్లకు పెంచింది. ఇప్పటివరకు ఈ విధానంలో సుమారు 22 లక్షల మంది అమెరికాను వీడినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

## వాణిజ్య ఎల్పీజీ వాడకంపై కేంద్రం కీలక నిర్ణయం

ఢిల్లీ , మార్చి 18 (భారత శక్తి): దేశంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ (ఎల్పీజీ)కు ఎలాంటి కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజలు ఆందోళనతో అనవసరంగా ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని భరోసా ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ఇవాళ ఒక ప్రకటన విడుదల చేసింది. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని దాదాపు 40 శాతం పెంచినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎల్పీజీ సిలిండర్ల డెలివరీలు యథాతథంగా కొనసాగుతున్నాయని, పక్కదారి పట్టకుండా నిరోధించేందుకు ఆన్‌లైన్ బుకింగ్‌లు, డెలివరీ అథెంటికేషన్ కోడ్ (DAC) వాడకాన్ని పెంచామని వివరించింది. దేశీయ అవసరాలకు సరిపడా పెట్రోల్, డీజిల్ ఉత్పత్తి జరుగుతోందని, వీటి దిగుమతుల అవసరం లేదని పేర్కొంది. అదే సమయంలో వాణిజ్య ఎల్పీజీ వాడకాన్ని తగ్గించి, పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) వైపు మళ్లేలా ప్రోత్సహించే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 10 శాతం అదనపు వాణిజ్య ఎల్పీజీ కోటాను కేటాయించనున్నట్లు ప్రకటించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఆసుపత్రులు వంటి వాణిజ్య సంస్థలు పీఎన్జీ కనెక్షన్లు తీసుకోవాలని సూచించింది. ఇందుకోసం సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) కంపెనీలు ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నాయని తెలిపింది. ప్రత్యామ్నాయ వంట ఇంధనంగా రాష్ట్రాలకు అదనంగా 48,000 కిలోలీటర్ల కిరోసిన్‌ను కేటాయించామని, గృహ అవసరాలు, సీఎన్జీ రవాణా వంటి కీలక రంగాలకు గ్యాస్ సరఫరాలో ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా సీజీడీ నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ, పరిశుభ్రమైన ఇంధన వాడకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని ప్రభుత్వం వివరించింది.

## రష్యా నుంచి చైనాకు చమురు ట్యాంకర్.. భారత్ దిశగా మళ్లిన అక్వాటైటాన్

ఢిల్లీ, మార్చి 18 (భారత శక్తి):చైనాకు తరలిస్తున్న రష్యా చమురు ట్యాంకర్ అక్వాటైటాన్ భారత్ వైపు మళ్లింది. దక్షిణ చైనా సముద్ర జలాల్లో అది భారత్ దిశ వైపు తిరిగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో, భారత ప్రభుత్వం దేశంలో చమురు సంక్షోభం లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి భారత్ దిగుమతులను పెంచింది. ఈ క్రమంలో అక్వాటైటాన్ ట్యాంకర్ మార్చి 21న కర్ణాటకలోని న్యూమంగళూరుకు చేరుకోనుంది. ఈ ఏడాది జనవరి చివరలో బాల్టిక్ సీ పోర్టులో ఈ ట్యాంకర్‌లోకి చమురు లోడ్ అయింది. ఈ నౌక వాస్తవానికి చైనాలోని రిజావో పోర్టుకు వెళ్లాల్సి ఉంది. యుద్ధం నేపథ్యంలో రష్యా చమురును కొనుగోలు చేయాలని భారత్ నిర్ణయించిన నేపథ్యంలో, ఇప్పుడు దిగుమతులు పెరిగాయి. ఈ నేపథ్యంలో భారత రిఫైనరీలు రష్యా నుంచి 30 మిలియన్ల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేశాయి. జపాన్, దక్షిణ కొరియా దేశాలు కూడా రష్యా చమురు దిగుమతులను పెంచడంతో ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి చమురు ట్యాంకర్లు సహా 90 నౌకలు హర్మూజ్ జలసంధిని దాటాయి. ఈ నౌకలన్నీ తమ ట్రాకింగ్ వ్యవస్థలను ఆపేసి, డార్క్ మోడ్‌లో పాశ్చాత్య దేశాల ఆంక్షలను దాటుకుని హర్మూజ్ మీదుగా ప్రయాణించాయి.



## రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, మార్చి 18 (భారత శక్తి): రైతులకు తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీపి కబురు అందించారు. ఈ నెల 22వ తేదీన సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ విడుదల చేయనున్నారని ఆయన వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమం ఆగకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయకపోయినా, రైతుల ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రభుత్వం ఇవాల్టి నుంచే కొనుగోళ్లను ప్రారంభించిందని తుమ్మల వెల్లడించారు. సిద్దిపేట జిల్లా నర్మెటలో రేపు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని చెప్పారు.



* సిద్దిపేట ప్రజలకు తెలుగు నూతన సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు
* మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

# మంచి మార్పుకు ఈ 'పరాభవ' సుగమం పలకాలి

సిద్దిపేట, మార్చి 18 (భారత శక్తి): తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సిద్దిపేట జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.. ఈ ఉగాది పచ్చడిలాగే మీ జీవితం షడ్రుచుల సంగమంగా మారాలని కోరుతూ ఈ ఉగాది మీ కష్టాలకు ముగింపు మీ విజయాలకు ఆరంభం కావాలని కోరుకుంటూ తెలుగు వారి సంప్రదాయాలకు ప్రతిరూపమైన ఉగాది సందర్భంగా శ్రీ పరాభవ నామ సంవత్సరం లో ఆధ్యాత్మిక భావన పరిడ విల్లాలని మనలో మంచి మార్పుకు పరాభవ సుగమం పలకాలన్నారు. ఈ సంవత్సరం అన్నిరంగాల్లో పురోభివృద్ధిని సాదించాలని తెలిపారు. గత పదేళ్లలో బి అర్ ఎస్ ప్రభుత్వం లో తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాదించి పురోగమనంలోకి వచ్చింది.ఈ 27 నెలల్లో ప్రజా సంక్షేమ రాష్ట్ర అభివృద్ధి పేరు ప్రతిష్ట లు తిరుగోమానం లోకి వచ్చిందన్నారు. ఈ మండు టెండల్లో కూడా పంట పొలాలు పచ్చగా ఉన్నాయంటే తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కెసిఆర్ గారి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కృషి ఫలితమేనన్నారు.ఈ మండు టెండల్లో చెరువులు, చెక్ డ్యామ్ లు మత్తళ్లు దుంకుతున్నాయని, కొంత ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి తో కొన్ని ప్రాంతాల్లో సాగు నీటి ఇబ్బందులు తలెత్తి రైతులు ఆందోళన చెందుతున్నరన్నారు. ఈ యేటా వర్షాలు సమృద్ధిగా కురువాలని, రైతులు ఆనందంతో పాడి పంటలతో వర్ధిల్లాలన్నారు. అన్నింటా శుభం జరగాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కొత్త సంవత్సర పర్వదినం అందరి కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకున్నారు.




# ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

: **జోనల్ కమిషనర్‌కు భాజపా నాయకుల వినతి.**

ఎల్బీనగర్, మార్చి 18 (భారత శక్తి): ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్ నగర్ తహసీల్దార్ జానకికి వినతిపత్రం అందజేశారు. బి.ఎన్.రెడ్డి నగర్, హయత్ నగర్, వనస్థలిపురం, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలోని సమస్యలు, పెండింగ్ హామీలపై రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే:**


తులం బంగారం: కళ్యాణలక్ష్మి పథకం కింద ఇస్తానన్న తులం బంగారాన్ని వెంటనే పంపిణీ చేయాలి.

* మహిళా భృతి: అర్హులైన మహిళలందరికీ నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం అందించాలి.
* నూతన పెన్షన్లు: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెండింగ్‌లో ఉన్న కొత్త పెన్షన్లను తక్షణమే మంజూరు చేయాలి.
* జాబ్ క్యాలెండర్: నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, చేనేత మోర్చా రాష్ట్ర కన్వీనర్ బొమ్మ రఘురాం నేత, పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, గంగని శ్రీనివాస్, క్రాంతి గౌడ్, మునగాల హరీష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, కార్యదర్శి నూతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పన్నులు చెల్లించి దుబ్బాక మున్సిపల్ అభివృద్ధికి పాటుపడండి

* **మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం**
* **మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత**




సిద్దిపేట, మార్చి 18 (భారత శక్తి): మున్సిపాలిటీ లో పన్నులను సకాలంలో చెల్లించడం పౌరులందరి బాధ్యత అని, పెండింగ్లో ఉన్న ఆస్తి పన్ను, నల్లా పన్నులను ప్రజలందరూ ఈనెల 31వ తేదీ లోపు చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని దుబ్బాక పురపాలిక చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత కోరారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో చైర్పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ బిల్ కలెక్టర్లకు, ఇతర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురపాలికలో మార్చి 31వ తేదీ లోపు 100% పన్నుల వసూలే లక్ష్యంగా పుర అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు.ప్రస్తుత వేసవి కాలంలో మున్సిపాలిటీ లో నీటి ఎద్దడి లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. వార్డుల్లో మిషన్ భగీరథ నీటిని పొదుపుగా వాడుకునేందుకు నల్లాలకు తప్పనిసరిగా ఆన్, ఆఫ్ స్విచ్ లను ఏర్పాటు చేయాలని మునిసిపల్ సిబ్బందిని ఆదేశించారు. మునిసిపల్ పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలపై సిబ్బంది మరింత దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పురపాలిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ





సిద్దిపేట, మార్చి 18 (భారత శక్తి): దుబ్బాక మండల పరిధిలోని పెద్ద చికోడ్ గ్రామంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం 'రంజాన్ తోఫా' పంపిణీ కార్యక్రమాన్ని అఖిల రాజ్ పౌండేషన్ వ్యవస్థాపకులు కూకట్పల్లి ఎస్ఐ తౌడా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నిరుపేద ముస్లిం సోదర, సోదరీమణులకు అండగా 70 ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు, 20 మంది వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కూకట్పల్లి ఎస్ఐ తౌడా సత్యనారాయణ మాట్లాడుతూ, రంజాన్ పండుగ ఆత్మీయత, సహకారం, దాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సహాయం చేయడమే తమ బాధ్యత అని తెలిపారు. ఈటూవంటి కార్యక్రమాలతో సామాజిక సామరస్యం మరింత బలపడుతుందని అందరూ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమిరే నరేష్ ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గం, పోతారం గ్రామ సర్పంచ్ రేణుక మల్లేశం,అఖిల రాజ్ పౌండేషన్ సభ్యులు ఇనుప రవి,బిట్ల భాస్కర్,కంకణాల చంద్రం, వనం పోశయ్య, బండ నర్సింలు,ఇనుప రాజనర్సు,చంద్రం,పోశయ్య గ్రామస్తులు,ముస్లిం సమాజ నాయకులు మొత్తం 100 మంది ముఖ్య వ్యక్తులు పాల్గొన్నారు.



## డివిజన్ సమస్యలను
# పరిష్కరించాలని డీసీకి విన్నపం

ఎల్బీనగర్, మార్చి 18 (భారత శక్తి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు చైతన్యపురి డివిజన్ బీజేపీ మాజీ కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా ఆధ్వర్యంలో సమస్యలు, సంక్షేమ పథకాల అమలు విషయంలో బాధితులతో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ సరూర్నగర్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ను కలిసి బాధితులకు తక్షణమే సంక్షేమ పథకాలు అందజేయాల్సిందిగా డివిజన్లో పేరుకుపోయిన అనేక సమస్యలు దోమల విషయంలో గాని రోడ్ల విషయంలో గాని శానిటేషన్ విషయంలో గానీ, డ్రైనేజీ, త్రాగు నీటి విషయంలో తక్షణమే బాగు చేయాలని వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో చైతన్యపురి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బాధితులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**- వంగ రాజేశ్వర్ రెడ్డి**




సిద్దిపేట ప్రతినిధి, మార్చి 18 (భారత శక్తి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షం భారీ ఈదురు గాలులకు మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు.ఈ విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభావితమైన గట్లమల్యల, సంతోష్ నగర్ గ్రామాలను సందర్శించి క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించారు.రైతుల పంట దాదాపుగా 1000 ఎకరాల పైగా నష్టపోయారని వాపోయారు. తమకు జరిగిన నష్టం సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన పంట నష్టాన్ని చూసి ఎంతో బాధ కలిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆర్థిక పరిస్థితి పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడినదని, ఈ నష్టం వారికి తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ అధికారులు తక్షణమే నష్టాన్ని సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, రైతులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి త్వరితగతిన పరిహారం అందేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని రైతులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.రైతులకు తగిన పరిహారం చెల్లించే వరకు తాను రైతులకు మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ సర్పంచ్ బానోత్ సరోజన, సర్పంచ్లు, మాజీ సర్పంచ్లు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# వామ్మో ఇగ బయట టిఫిన్లు తిన్నట్లే

* **మహానగరంలో మాయలు చేస్తున్న హోటల్స్**
* **జీఎస్టీతో పాటు అదనంగా మనిషికి 5 రూపాయలు వసూల్**




ఎల్బీనగర్, మార్చి 18 (భారత శక్తి): పొద్దుగాల టిఫిన్ తిందామని హోటల్ కు వెళితే మెనూలో ఉండని, వింత బాదుడు మొదలు పెట్టారు టిఫిన్ సెంటర్ల యజమానులు. అక్కడ ఎక్కన్నో బాంబులు వేస్తుంటే, ఇక్కడ తిని చెయ్యి కడిగినాకా చేతిలో బాంబులాంటి బిల్లుల రూపంలో బాదుడు మొదలు పెట్టారు.కర్మాన్ ఘాట్ లోని శ్రీ రాఘవేంద్ర ఉడిపి హోటల్ వారు చెప్పా పెట్టకుండా మనిషికి 5 రూపాయల చొప్పున జీఎస్టీకి అదనంగా చేతిలో బిల్లు పెట్టి, గ్యాస్ కొరత వలన రేట్లు పెంచాల్సి వచ్చిందని, 50 రూపాయలు ఉన్న మసాలా దోశ 70కి, 40 రూపాయలు ఉన్న ప్లేన్ దోశ 60కి పెంచి, కస్టమర్స్ నుండి ముక్కు పిండి దోపిడీ చేస్తున్నారు. అధికారులు ఏమో ఎక్కడ గ్యాస్ కొరత లేదని ప్రజలకు ఊక దంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న సమయంలో, గ్యాస్ కొరత ఉందని, ఆ సాకుతో ఇంత మోసం చేస్తున్న హోటల్స్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని,సామాన్య ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ సీఎస్ పదవీ కాలం మరోసారి పొడిగింపు



హైదరాబాద్,మార్చి 18 (భారత శక్తి): తెలంగాణ సీఎస్ కె.రామకృష్ణారావు పదవీ కాలాన్ని కేంద్రం మరోసారి పొడిగించింది. ఆయన పదవీ కాలం పొడిగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ వినతికి కేంద్రం అంగీకారం తెలిపింది. మరో మూడు నెలలు పొడిగించింది. గతేడాది ఏప్రిల్ 30న సీఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టారు. అదే ఏడాది ఆగస్టులోనే ఆయన పదవీ విరమణ చేయాల్సింది. అప్పుడు ఏడు నెలలు పొడిగించింది. ఇప్పుడు మరోసారి పొడిగింపుపై కేంద్రం నిర్ణయం తీసుకుంది.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.